


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 185 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కడప బుధవారం 11 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :185 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED :KADAPA WED 11 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ

- ఏపీ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ ఏర్పాటుకు సన్నాహాలు
- రాబోయే పదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 40 వేల ఉద్యోగాలే టార్గెట్
- శ్రీకాకుళం, అనకాపల్లి, మచిలీపట్నంలో 3 ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదన
- రాష్ట్రంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్‌ను 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు రాష్ట్ర తీరప్రాంతంలో లభించే విలువైన బీచ్ సాండ్ వంటి ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. తద్వారా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపునివ్వాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో గనుల శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ (ఆప్‌స్ట్రా-మాటీవీ)' ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మిషన్ ద్వారా రాబోయే పదేళ్లలో రూ. 50,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు, 40,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం వనరులను వెలికితీయడమే కాకుండా, వాటికి విలువ జోడించడం (వాల్యూ ఎడిషన్)పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలోని వనరులపై పూర్తి అవగాహన పెంచుకోవడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక



ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా, రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని అధికారులు సీఎంకు వివరించారు. వీటిలో ప్రధానంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి వ్యూహాత్మక ప్రాధాన్యమున్న ఖనిజాలు ఉన్నట్లు తెలిపారు. ఈ బీచ్ సాండ్ మినరల్స్ నుంచి వచ్చే ఉత్పత్తులు పెయింట్స్, కాస్మెటిక్స్, ఫార్మా రంగాలతో పాటు ఏరోస్పేస్, రక్షణ, శస్త్రచికిత్స పరికరాలు, సెరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం, అణు రియాక్టర్ల విడిభాగాల తయారీ వంటి అత్యంత కీలకమైన పరిశ్రమలకు అవసరమని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకునేందుకు రాష్ట్రంలో మూడు ముఖ్యమైన ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. శ్రీకాకుళంలో టైటానియం

మిగతా 2లో



## అది ఫేక్ ప్రచారం... వాటిని నమ్మొద్దు

- దేవాలయాల విధ్వంసంపై వైసీపీ ఫేక్ ప్రచారం చేస్తోందన్న మంత్రి లోకేశ్
- కసాపురం ఆలయ పునర్నిర్మాణ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్
- ఆగమ సలహాదారుల ప్రకారమే పాత ఆలయాన్ని తొలగించామని వెల్లడి
- వైసీపీ పేటియం బ్యాచ్ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ నాయకత్వంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆలయాలపై దాడులు అంటూ

మిగతా 2లో



## ఇండిగో వరుస వైఫల్యాలు.. కంపెనీ సీఈవో రాజీనామా

**పెన్ పవర్ డెస్క్:** వరుస వైఫల్యాలతో విమానయాన రంగాన్ని ఓ కుదుపు కుదుపేసిన ఇండిగో సంస్థలో కీలక పరిణామం జరిగింది. తమ కంపెనీ సీఈవో పీటర్ ఎల్బర్స్ రాజీనామా చేసినట్లు యాజమాన్యం ప్రకటించింది. ఆయన రాజీనామా మంగళవారం (మార్చి 10) నుంచి అమలులోకి వస్తుందని వెల్లడించింది. సంస్థ నుంచి ఎల్బర్స్ తప్పుకోవడంతో.. ఆయన స్థానంలో రాహుల్ భాటియా బాధ్యతలు తీసుకోనున్నారు. మధ్యంతర సీఈవోగా భాటియాకు బాధ్యతలు అప్పగించినట్లు మేనేజ్మెంట్ ప్రకటించింది. తదుపరి ఏర్పాట్లు పూర్తయ్యేలోపు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ గా కొనసాగుతారని యాజమాన్యం తెలిపింది.

**ఏంటి ఇండిగో సంక్షోభం:**

నవంబర్ 1, 2025 నుంచి పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చిన ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నిబంధనల రెండో దశ ఈ సంక్షోభానికి ప్రధాన మూలకారణం.

మిగతా 2లో

## జంట హత్యల కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి చుక్కెదురు



- గుండ్లపాడు జంట హత్యల కేసు
- బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన గురజాల కోర్టు
- కేసు తీవ్రత దృష్ట్యా బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసిన న్యాయస్థానం
- గతేడాది జరిగిన ఈ హత్యల కేసులో ఏ-7 నిందితుడిగా ఉన్న వెంకట్రామిరెడ్డి
- కోర్టు తీర్పుతో జైలులోనే కొనసాగనున్న వైసీపీ నేత


మిగతా 2లో

## బీసీసీఐ, ఐసీసీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సీఎం చంద్రబాబు

- తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా అమరావతిని అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశం
- సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులతో పాటు క్రీడలు, పర్యాటక రంగాలపై ప్రత్యేక దృష్టి
- పెట్టుబడుల కోసం వచ్చే సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచన
- నీరుకొండలో భారీ టూరిజం ప్రాజెక్టుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్దేశం
- సచివాలయం, పలు సంస్థలకు భూ కేటాయింపులకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం

**పెన్ పవర్ డెస్క్:** తెలుగు జాతి వైభవాన్ని ప్రపంచానికి చాటుతూ, భావితరాలకు ఒక గొప్ప వారసత్వ సంపదగా నిలిచేలా రాజధాని అమరావతిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణంలో ఆదాయాన్ని సృష్టించే సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 59వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ భేటీలో రాజధాని అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలపై చర్చించి, ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాజధాని పరిధిలోని నీరుకొండ వద్ద చేపట్టే టూరిజం ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. మొత్తం 167 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టే ఈ ప్రాజెక్టులో వాటర్ ఫ్రంట్, కల్చరల్ సెంటర్, హోటళ్లు, అమ్యూజ్‌మెంట్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా, తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా దీనిని అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని

మిగతా 2లో



## వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష

- 10 శాతం మేర ఉత్పత్తి పెంచాలని ఇంధన ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు
- భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయన్న కేంద్రం
- దేశానికి 70 శాతం ఉత్పత్తులు ఇతర మార్గాల్లో వస్తున్నాయన్న కేంద్రం

**పెన్ పవర్ డెస్క్:** వంటగ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వంటగ్యాస్‌ను బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో 10 శాతం మేర ఉత్పత్తిని పెంచాలని ఇంధన

మిగతా 2లో

# ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస...

## చొక్కాలు పట్టుకున్న కౌన్సిలర్లు

- కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం, బాహాబాహీ
- నీటి సమస్యపై చర్చించాలని బీజేపీ డిమాండ్
- కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య తోపులాట
- చైర్‌పర్సన్ కార్యాలయం ఎదుట బైఠాయించిన బీజేపీ

మిగతా 2లో





## భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పాలన సాగించాడు

- సిమెంట్ ధర పెంచి ప్రజలపై రూ.165 కోట్ల భారం మోపారని విమర్శ
- జగన్ చేసిన అప్పులకు ఏటా రూ.71,800 కోట్లు చెల్లించాల్సి వస్తోందని వెల్లడి
- వైసీపీ ఐదేళ్ల పాలనలో చేసిన ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే నిదర్శనమని వ్యాఖ్య
- కూటమి ప్రభుత్వంపై జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని ధ్వజం

**పెన్ పవర్ డెస్క్:** గత ఐదేళ్ల జగన్ పాలనంతా సొంత కంపెనీలకు లబ్ధి చేకూర్చడం కోసమే సాగిందని, ముఖ్యంగా భారతి సిమెం ట్ వ్యాపారాన్ని విస్తరించడమే లక్ష్యంగా పనిచేశారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ

మిగతా 2లో

# ప్రభుత్వానికి తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ

## లోక్‌సభలో ప్రియాంక గాంధీ

- లోక్‌సభలో సోదరుడిని గట్టిగా సమర్థించిన ప్రియాంక గాంధీ
- నెహ్రూను విమర్శించే బీజేపీ నేతలే ఇప్పుడు ఆయన్ను ఉటంకిస్తున్నారని చురక
- స్పీకర్ ఓం బిర్లా తొలగింపు తీర్మానంపై చర్చ సందర్భంగా ఈ వ్యాఖ్యలు



**పెన్ పవర్ డెస్క్:** లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తన సోదరుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని గట్టిగా సమర్థించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి తలవంచకుండా నిలబడిన ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ అని ఆమె కొనియాడారు. మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలంటూ ప్రవేశపెట్టిన తీర్మానంపై జరిగిన చర్చలో ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. సభకు అధ్యక్షత వహిస్తున్న ప్యానెల్ స్పీకర్ కృష్ణ ప్రసాద్ తెన్నేటి అనుమతితో ప్రియాంక మాట్లాడారు. ఈ సందర్భంగా అధికార పక్షంపై ఆమె చురకలు అంటించారు. "ప్రతిరోజూ నెహ్రూజీని విమర్శించే వారే, ఈ రోజు ఆయనను ఉటంకించడం చూసి నాకు నవ్వొచ్చింది. ఒక్కసారిగా వారికి నెహ్రూజీపై గౌరవం పుట్టుకొచ్చింది. ప్రజాస్వామ్యాన్ని అత్యంత

మిగతా 2లో

# ఆర్థిక సంక్షోభంలో పాకిస్థాన్

## మంత్రులకు కూడా జీతాలు కట్.. ప్రధాని షరీఫ్ సంచలన నిర్ణయాలు

- పశ్చిమాసియా యుద్ధంతో పాక్ అతలాకుతలం
- అత్యంత కఠినమైన పొదుపు చర్యలను ప్రకటించిన షెహబాజ్ షరీఫ్
- వారానికి నాలుగు రోజులే పని చేయనున్న ప్రభుత్వ కార్యాలయాలు

**పెన్ పవర్ డెస్క్:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ మార్కె ట్‌లో ఆయిల్ ధరల పెరుగుదల పాకిస్థాన్‌ను

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# పొగతో మసకబారుతున్న బతుకులు

అత్యధిక మరణాలకు కారణంగా నిలుస్తున్న పొగ తాగడమనే దురలవాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ప్రతి ఏట మార్చి మాసం 2వ బుధవారం, అనగా 11 మార్చిన "నేషనల్ నో స్మోకింగ్ డే" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఊపిరితిత్తులకు సంబంధించిన ప్రాణాంతక వ్యాధులు, శరీరంలో ప్రాణ వాయువు మోతాదులు తగ్గడం, బీపీ/స్ట్రోక్ లాంటి హృద్రోగాలకు దారి తీస్తున్న పొగ తాగడమనే దురలవాటు బారిన పడిన మిలియన్ల ప్రజలు మరణం అంచున తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకోవడం, కుటుంబాలు ఆర్థిక సమస్యలను ఎదుర్కోవడం, కుటుంబ సభ్యులు అనాథలుగా మారడం లాంటి ప్రతికూలతలు పొగరాయుళ్లను వెంటాడుతున్నాయి. పొగ తాగడాన్ని క్రమంగా తగ్గించడంతో ఫలితంగా సత్వరమే బీపీ, ఊపిరితిత్తులు, గుండె స్పందనలు మెరుగవుతాయి. పొగ మానేస్తే శరీరంలో ప్రమాదకర కార్బన్ మోనాక్సైడ్ పరిమాణం తగ్గుతూ ఆరోగ్య పునరుద్ధరణకు బాటలు పడతాయి. పొగ తాగడమనే దురలవాటు తీవ్ర ప్రభావాలను దృష్టిలో పెట్టుకొన్న ప్రపంచ పౌర సమాజం 1984 నుంచి ప్రతి ఏట 2వ బుధవారం రోజున విశ్వవ్యాప్తంగా "నేషనల్ నో స్మోకింగ్ డే" పాటించడం కొనసాగుతున్నది. పొగను వదిలితే ఆరోగ్యం మెరుగవుతుందనే నినాదాన్ని క్రిందటి స్థాయి వరకు ప్రచారం చేయడం నేటి అవసరంగా భావించాలి. ప్రత్యక్షంగా పొగ తాగడంతో పాటు పొగరాయుళ్లతో పాటు వారు వదిలే పొగను పీల్చే సెకండ్ హాండ్ స్మోకర్స్ కూడా పొగ తాగినట్లుగా, అనారోగ్యం పాలు అవుతారని భావించాలి. పొగ తాగడం ప్రాణాంతకం కావడంతో బహిరంగ ప్రదేశాల్లో స్మోకింగ్ నిషేధం విధించబడడం సముచిత నిర్ణయంగా కొనియాడాలి. పొగ తాగడంవల్ల ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్ సంభావ్యత పెరుగుతుందని పొగరాయుళ్లు గమనించాలి. పొగ తాగడం వల్ల జీర్ణనాళం, మూత్రపిండాలు, కాలేయం, యూరినరీ బ్లాడర్ లాంటి ప్రధాన అవయవాలు కూడా దెబ్బతినడం ఖాయమని తేలింది. 2026 నేషనల్ నో స్మోకింగ్ డే ఇతివృత్తంగా "అన్‌మాస్కింగ్ ది అప్పీల్ : కౌంటరింగ్ నికోటిన్ అండ్ టొబాకో అడిక్షన్" లేదా "విజ్ఞప్తులను చేద్దాం : నికోటిన్, పొగాకు దురలవాటును వ్యతిరేకిద్దాం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. పొగ తాగడమనే దురలవాటు వల్ల వ్యక్తి జీవితకాలం కనీసం 10 ఏండ్లు తగ్గుతుందని తేలడం ప్రమాద హెచ్చరికగా భావించాలి. స్టైల్‌గా పొగ పీల్చడం వల్ల అనారోగ్యాలు, ఆర్థిక భారం, ఆసుపత్రి బిల్లులు, సమాజంలో చెడు పేరు, కుటుంబాల్లో చీకట్లతో పాటు చివరికి అకాల మరణం లాంటివి ఉచితంగా వస్తాయని పొగరాయుళ్లు బుద్ధి తెచ్చుకోవాలి. పొగ తాగడం వల్ల చికాకు లేదా ఇర్రిటేషన్, పొగ పట్ల తీవ్రమైన కోరిక, చంచలత్వం, నిద్రలేమి లాంటి రోగ లక్షణాలు బయట పడడం, తర్వాత తీవ్రమైన ఊపిరితిత్తులు, హృద్రోగాలు, శ్వాస క్రియ రోగాలకు దారి తీస్తుంది. "పొగకు స్వస్తి పలుకుదాం – కొత్త జీవితాలను ప్రారంభిద్దాం" అంటూ శారీరక మానసిక ఆరోగ్యాలను ఆహ్వానిస్తూ, తన కోసమే కాదు తనను నమ్మిన వారి కోసం ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకుందాం. మన ప్రాణాలు తీయక ముందే మనమే పొగకు విడాకులిద్దాం. పొగకు లొంగకుండా మన జీవితాలను సుసంపన్నం చేసుకుందాం. పొగ దురలవాటు డబ్బుతో ముడిపడింది కాదని, కుటుంబ జీవితాలతో సంబంధాన్ని పెనవేసుకుందని తెలుసుకోవాలి. పొగను వదిలితే నీ ఆరోగ్యంతో పాటు పర్యావరణ ఆరోగ్యం కూడా దెబ్బ తింటుందని మరువరాదు. తమ బతుకులు పొగసూరక ముందే బుద్ధి తెచ్చుకొని పొగకు 'నో' చెబుదాం, ఆరోగ్యకర జీవితానికి 'ఎస్' చెబుదాం.

# వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష

- మొదటి పేజి తరువాయి

ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. ఇంధన ఉత్పత్తిపై ఆందోళనలు రేకెత్తుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక భేటీ నిర్వహించారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరితో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. ఎల్పీజీ నిల్వలు, సరఫరాపై సమీక్ష జరిపారు. కాగా ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కేంద్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. కమర్షియల్ ఎల్పీజీ వాస్తవ అవసరాలను గ్యాస్ కంపెనీలు అందుకోవాల్సిందేనని ఇంధన కంపెనీలకు స్పష్టం చేసింది. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో కొంత సంక్షోభం వాస్తవమే కానీ పెట్రోలియం ఉత్పత్తుల ప్రస్తుతానికి ఇబ్బంది లేదని కేంద్రం తెలిపింది. పశ్చిమాసియాలో యుద్ధానికి ముందు తరహాలోనే భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. దేశానికి వచ్చే 70 శాతం ఉత్పత్తులు హోర్ముజ్ జలసంధి నుంచి కాకుండా ఇతర మార్గాల్లో వస్తున్నట్లు కేంద్రం తెలిపింది.

# బీసీసీఐ, ఐసీసీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

అన్నారు. భవిష్యత్తులో క్రీడా రంగం అతిపెద్ద ఆదాయ వనరుగా మారబోతోందని చంద్రబాబు విశ్లేషించారు. ఒకప్పుడు నిధుల కోసం ఎదురుచూసిన బీసీసీఐ, ఐసీసీ వంటి క్రికెట్ బోర్డులు ఇప్పుడు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఎలా ఎదిగాయో గమనించాలని అన్నారు. ఇదే తరహాలో ఇతర క్రీడలు కూడా వాణిజ్యపరంగా మారే అవకాశాలను అందిపుచ్చుకోవాలని, అమరావతిలో నిర్మించే స్పోర్ట్స్ సిటీ మాస్టర్ ప్లాన్ ఈ దిశగా ఉండాలని తెలిపారు. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు పలు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని, వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఉండాలని చంద్రబాబు అన్నారు. "గతంలో ఉమ్మడి రాష్ట్రంలో మా ప్రభుత్వ హయాంలో సైబర్ సిటీలో పెట్టుబడులు పెట్టలేకపోయినందుకు డీఎల్ఎఫ్ వంటి సంస్థలు ఇప్పుడు బాధపడుతున్నాయి. అమరావతిలో ఆ అవకాశాన్ని వదులుకోకూడదని భావిస్తున్నాయి. ఇది మన ప్రభుత్వానికి ఉన్న విశ్వసనీయత. ఈ బ్రాండ్‌ను మరింతగా పెంచాలి" అని సూచించారు. ఓవైపు రాజధానిలో పనులను వేగవంతం చేస్తూనే, మరోవైపు పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రక్రియ కొనసాగాలని స్పష్టం చేశారు. అమరావతిలో నిర్మించబోయే తెలుగు కల్చరల్ సెంటర్‌కు మంచి పేరును పరిశీలించాలని, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ కోసం ఒక పెద్ద కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**సీఆర్డీఏ అథారిటీ ఆమోదాలు**

ఈ సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు అథారిటీ ఆమోదముద్ర వేసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కార్యాలయానికి 80 సెంట్ల భూమి, పరిహారంగా తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు, పంచాయితీరాజ్ పరిధిలోని ఏపీఎస్ఐఆర్డీకి 5 ఎకరాల భూమి కేటాయింపులకు ఆమోదం లభించింది.

వీటితో పాటు ఏపీ సచివాలయం, హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2,316 కోట్లకు, రూ.119 కోట్ల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు.

ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆర్థిక సంక్షోభంలో పాకిస్థాన్

- మొదటి పేజి తరువాయి

ఊపిరాడనీ యకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడుల ప్రభావంతో చమురు దిగుమతులు ప్రియమవ్వడంతో, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రధాని షెహబాజ్ షరీఫ్ అత్యంత కఠినమైన పొదుపు చర్యలు ప్రకటించారు. గల్ఫ్ దేశాల నుంచి వచ్చే చమురు సరఫరాపైనే తమ దేశం ఆధారపడి ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఖర్చులను తగ్గించుకోక తప్పదని ఆయన స్పష్టం చేశారు. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ కార్యాలయాలు ఇకపై వారానికి నాలుగు రోజులు (సోమవారం నుంచి గురువారం వరకు) మాత్రమే పనిచేస్తాయి. అయితే బ్యాంకులు, ఆసుపత్రులు, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ఈ నిబంధన వర్తించదు. వచ్చే రెండు వారాల పాటు స్కూళ్లు, కాలేజీలు మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఉన్నత విద్యా సంస్థలు తరగతులను ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, అధికారిక వాహనాలకు ఇచ్చే పెట్రోల్ కోటాను 50 శాతానికి తగ్గించారు. అలాగే రాబోయే రెండు వారాల పాటు 60 శాతం ప్రభుత్వ వాహనాలను రోడ్డెక్కించబోమని ప్రధాని తెలిపారు. అంబులెన్స్‌లు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌కు దీని నుంచి మినహాయింపు ఇచ్చారు.

మంత్రులు, సలహాదారులు రాబోయే రెండు నెలల పాటు ఎటువంటి జీతాలు తీసుకోరు. పార్లమెంటు సభ్యులందరికీ 25 శాతం, రూ. 3 లక్షల కంటే ఎక్కువ సంపాదించే ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం

జీతాల్లో కోత విధించారు. ప్రధాని, ముఖ్యమంత్రులు, గవర్నర్లు సహా అందరు ప్రజాప్రతినిధులు, అధికారుల విదేశీ పర్యటనలపై పూర్తి నిషేధం విధించారు. కేవలం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అనుమతి ఉంటుంది.

# ఇండిగో వరుస వైఫల్యాలు.. కంపెనీ సీఈవో రాజీనామా

- మొదటి పేజి తరువాయి

ఈ నిబంధనలు పైలట్‌ల వారపు విశ్రాంతి సమయాన్ని 36 గంటల నుంచి 48 గంటలకు పెంచాయి. ఇది పైలట్‌ల అలసట రిస్క్‌ను తగ్గిస్తుంది. ఈ మార్పులు విమాన ప్రయాణాల భద్రతను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మెరుగుపరచాలని లక్ష్యంగా చేసిన ప్రయత్నం. ఈ నిబంధనల గురించి రెండు సంవత్సరాల ముందు నుంచే పూర్తి అవగాహన ఉన్నప్పటికీ, కొత్త నిబంధనలకు అనుగుణంగా తగినంత మంది సిబ్బందిని సమకూర్చుకోవడంతోపాటు రోస్టరింగ్ వ్యవస్థను మెరుగుపరచడంలో ఇండిగో నిర్లక్ష్యం వహించింది. భారతదేశంలో అత్యధిక విమానాలను నడుపుతున్న సంస్థగా, సిబ్బంది కొరతను సరిచేయడానికి ఇండిగో ప్రణాళికా లోపం సంస్థ కార్యకలాపాలను ఒక్కసారిగా కుప్పకూల్చింది.

**డీజీసీఏ వైఫల్యం**

దేశ పౌర విమానయాన భద్రతకు అత్యున్నత బాధ్యత వహించే డీజీసీఏ చర్యలు ఈ సంక్షోభంలో అసమర్థతను చూపించిందని నిపుణులు విమర్శిస్తున్నారు. డీజీసీఏ, ఇండిగోకు షోకాజ్ నోటీసు ఇవ్వడం న్యాయపరమైన చర్య అయినప్పటికీ, వేలాది విమానాలు రద్దై, ప్రయాణీకులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన తర్వాత మాత్రమే డీజీసీఏ స్పందించింది. ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్1937 ప్రకారం డీజీసీఏ సంస్థకు విమానయాన ఆపరేటర్‌పై భారీ జరిమానాలు విధించే అధికారం లేదా ఎయిర్ ఆపరేటర్స్ పర్మిట్ రద్దు చేసే అధికారం ఉంది. ఈ జాప్యం డీజీసీఏ వ్యవస్థాపరమైన పర్యవేక్షణ వైఫల్యాన్ని తెలియజేస్తుంది. ముందస్తు తనిఖీ చేయడంలో విఫలమవడం, డీజీసీఏ తన ప్రాథమిక భద్రతా విధులను పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్టేనని విమర్శలు వచ్చాయి.

**ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం**

దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో చట్టపరమైన బాధ్యతతో పాటు నైతిక బాధ్యత వహించాలి. నిబంధనల అమలుకు తగిన ఏర్పాట్లు చేయడంలో విఫలమవడం అనేది కేవలం నిర్వహణ లోపం కాదు. ఇది 'ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం'గా పరిగణించవచ్చు. ఎందుకంటే, తమ అధిక లాభాలను కాపాడుకోవడానికి, ఇండిగో భద్రతా నిబంధనల అమలును ఆలస్యం చేసిందని, తద్వారా సంస్థ విమానయాన చట్టాలను ఉల్లంఘించిందని స్పష్టం చేస్తోంది. న్యాయ పదజాలంలో 'రెస్ ఇప్సా లోక్విటూర్' అనే సూత్రం ఇక్కడ వర్తిస్తుంది. అంటే, నష్టం జరగడానికి సంస్థ నిర్లక్ష్యమే కారణమని స్పష్టంగా తెలుస్తోంది. ఈ నిబంధనల ఉల్లంఘన విమానయాన చట్టాల క్రింద ఇండిగో విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీసింది.

డీజీసీఏ సీఏఆర్? (పౌర విమానయాన అవసరాలు) సెక్షన్ 3, సిరీస్ ఎం, పార్ట్ ×ు అనేది విమాన ప్రయాణానికి నిరాకరించినప్పుడు, విమానాలు రద్దు అయినప్పుడు, ఆలస్యం అయినప్పుడు ప్రయాణీకులకు విమానయాన సంస్థలు అందించవలసిన సౌకర్యాలు, పరిహారం గురించిన నియమావళి ప్రకారం అందించాల్సిన నష్టపరిహారం, రిఫండ్‌లతో పాటు ఇతర సౌకర్యాలను సకాలంలో అందించడంలో కూడా ఇండిగో వైఫల్యం చెందింది. ఈ వైఫల్యం కారణంగా ఇండిగో కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019 కింద 'సేవా లోపం'కు పూర్తి బాధ్యత వహించాలి.

# భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పాలన సాగించాడు

- మొదటి పేజి తరువాయి

మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో విమర్శించారు. సిమెంట్ ధరను కృత్రిమంగా పెంచి ప్రజాధనాన్ని తన కంపెనీకి మళ్లించారని, అదే సమయంలో తన మీడియా సంస్థ అయిన సాక్షికి వందల కోట్ల రూపాయల ప్రకటనలు ఇచ్చుకున్నారని ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

**భారతి సిమెంట్‌కు రూ.165 కోట్ల లబ్ధి**

జగన్ తన అధికారాన్ని పూర్తిగా దుర్వినియోగం చేశారని పార్థసారథి ధ్వజమెత్తారు. "రాష్ట్రానికి ఆదాయం తెచ్చే మార్గాలను గాలికొదిలేసిన జగన్, తన కంపెనీల ఆదాయానికి మాత్రం ఎలాంటి లోటు రాకుండా చూసుకున్నారు. భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చేందుకు సిమెంట్ బస్తాపై రూ.3 పెంచి, ప్రజలపై ఏకంగా రూ.165 కోట్ల భారం మోపారు. ఈ నిర్ణయంతో భారతి సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం మూడు రెట్లు పెరిగింది. మరోవైపు, సాక్షి పత్రికకు ప్రకటనల రూపంలో రూ.400 కోట్లకు పైగా కట్టబెట్టారు. ప్రత్యేక జీవోలు జారీ చేసి వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో బలవంతంగా సాక్షి పత్రికను కొనిపించారు. దీన్నిబట్టి ఆయన పాలన ఎవరి కోసం సాగిందో స్పష్టమవుతోంది" అని పార్థసారథి విమర్శించారు.

**ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యం**

జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని, ఆయన సృష్టించిన ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో రాష్ట్రం మొత్తం రూ.9.70 లక్షల కోట్ల అప్పు చేసిందని, ఈ అప్పులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏటా రూ.71,800 కోట్లు అసలు, వడ్డీల రూపంలో చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

"ఇప్పుడు అసెంబ్లీకి రాకుండా ఇంట్లో కూర్చుని, కూటమి ప్రభుత్వంపై జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.87 వేల కోట్లు అప్పు చేసిందని దుష్ప్రచారం చేస్తున్నారు. కానీ కాగ్ నివేదిక ప్రకారం ఆ ఏడాదిలో మొత్తం అప్పు రూ.81 వేల కోట్లు. అందులో తొలి మూడు నెలలు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వమే రూ.27,025 కోట్లు అప్పు చేసింది. ఆ తర్వాత తొమ్మిది నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.53 వేల కోట్లు మాత్రమే అప్పు చేసింది. జగన్ చేసిన అప్పులతో ఆస్తులు సృష్టించలేదు, కానీ మేం మూలధన వ్యయం కింద రూ.16 వేల కోట్లు ఖర్చుచేసి భవిష్యత్ తరాలకు ఆస్తులను అందిస్తున్నాం" అని పార్థసారథి వివరించారు.

**సంక్షేమం, అభివృద్ధిలో ముందున్నాం**

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాల అమలులో రాజీ పడటం లేదని మంత్రి తెలిపారు. "జగన్ హయాంలో ఐదేళ్లలో అమ్మ ఒడికి రూ.26 వేల కోట్లు ఖర్చు చేస్తే, మా ప్రభుత్వం ఐదేళ్లలో రూ.35 వేల కోట్లు ఖర్చు చేయనుంది. సామాజిక పింఛన్లకు జగన్ రూ.58,500 కోట్లు ఖర్చు చేస్తే, మేం కేవలం 20 నెలల్లోనే రూ.58,654 కోట్లు చెల్లించాం. చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో రాష్ట్రంలో మళ్లీ విశ్వసనీయత పెరిగింది. జగన్ పాలనలో వెళ్లిపోయిన కంపెనీలు తిరిగి పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. ఇప్పటికే 20 పారిశ్రామిక పాలసీలు తీసుకొచ్చి, 20 నెలల్లో రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. తద్వారా 6.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం. ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. అన్నం పెట్టే రైతులను సైతం జగన్ మోసం చేశారని, ధాన్యం కొనుగోలు బకాయిలు రూ.1600 కోట్లు చెల్లించకుండా వెళ్ళిపోయారని పార్థసారథి మండిపడ్డారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోందని తెలిపారు. పోలవరం, అమరావతి వంటి కీలక ప్రాజెక్టులను నాశనం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను పక్కదారి పట్టించి రాష్ట్రాన్ని ఐదేళ్లు వెనక్కి నెట్టిన జగన్, ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టాలని చూడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

# జంట హత్యల కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి చుక్కెదురు

పల్నాడు జిల్లా గుండ్లపాడులో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ నేత పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి న్యాయస్థానంలో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను గురజాల కోర్టు సోమవారం కొట్టివేసింది. కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేయలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. గతేడాది గుండ్లపాడుకు చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు కోటేశ్వరరావు హత్యకు గురయ్యారు. తెలంగాణలోని హుజూర్‌నగర్‌లో ఒక వివాహానికి హాజరై బైక్‌పై తిరిగి వస్తుండగా, వెల్దుర్తి మండలం బొదిలవీడు సమీపంలో వారిని వాహనంతో ఢీకొట్టి హతమార్చారు. ఈ హత్యల వెనుక పిన్నెల్లి సోదరుల ప్రమేయం ఉందని ఆరోపణలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఏ–7 నిందితుడిగా ఉన్నారు. ఆయన తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన గురజాల కోర్టు, కేసు పూర్వాపరాలను, గాంభీర్యాన్ని దృష్టిలో ఉంచుకొని బెయిల్‌ను తిరస్కరించింది. తాజా తీర్పుతో వెంకట్రామిరెడ్డి జైలులోనే కొనసాగనున్నారు.

## ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్

# సమావేశం రసాభాస...

ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం రసాభాసగా మారింది. కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. రెండు పార్టీల కౌన్సిలర్లు పరస్పరం చొక్కాలు పట్టుకుని, బాహాబాహీకి దిగారు. ఇరు పార్టీల గందరగోళం మధ్యనే ఛైర్‌పర్సన్ అనూష 'అజెండా పాస్' అంటూ ప్రకటన చేసి తన ఛాంబర్‌లోకి వెళ్లిపోయారు. అయితే చర్చ లేకుండానే అజెండాను ఎలా పాస్ చేస్తారని బీజేపీ కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్ ఛాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఛైర్‌పర్సన్, కాంగ్రెస్ కౌన్సిలర్లు బయటకు రాకుండా బీజేపీ కౌన్సిలర్లు అడ్డుకున్నారు. పోలీసులు జోక్యంతో ఛైర్‌పర్సన్ బయటకు వచ్చారు. దీంతో దాదాపు మూడు గంటల పాటు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కాగా, నీటి సమస్యపై చర్చించాలని బీజేపీ కౌన్సిలర్లు డిమాండ్ చేయడం ఉద్రిక్తతకు దారి తీసింది. కాంగ్రెస్ కౌన్సిలర్ అజయ్, బీజేపీ కౌన్సిలర్ రాకేష్ మధ్య తోపులాట చోటు చేసుకుంది. పాలకవర్గం సభను నామమాత్రంగా నిర్వహిస్తున్నారని బీజేపీ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

# అది ఫేక్ ప్రచారం... వాటిని నమ్మొద్దు

- మొదటి పేజి తరువాయి

అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాల విధ్వంసం జరుగుతున్నట్లు వైసీపీ ఫేక్ ముఠా ప్రచారం చేస్తోంది... ఇందులో ఎలాంటి వాస్తవం లేదు... వీటిని నమ్మొద్దు... ప్రజల మధ్య కులం, మతం, ప్రాంతం పేరుతో అలజడి రేపేందుకు యత్నిస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణం సందర్భంగా తీసిన వీడియోలతో ఫేక్ ప్రచారం చేస్తున్నారు. దేవాలయ గర్భాలయం, విమానగోపురం, అర్ధ మండపం రాతి నిర్మాణపు పనులు 60 శాతం పూర్తయ్యాయి. దేవస్థానం వైదిక కమిటీ సభ్యుల తీర్మానం ప్రకారం, ఆగమ సలహాదారుల సూచనల మేరకు ఫిబ్రవరి 28న శాస్త్రోక్తంగా పాత ఆలయాన్ని తొలగించారు. ఫేక్ ప్రచారం చేస్తున్న వైసీపీ పేటియం బ్యాచ్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రజలు నిజానిజాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అంటూ నారా లోకేశ్ ట్వీట్ చేశారు.

# ప్రభుత్వానికి తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ

- మొదటి పేజి తరువాయి

బలోపేతం చేసింది నెహ్రూజీనే అని ఇప్పుడు చెబుతున్నారు" అని ప్రియాంక వ్యాఖ్యానించగా, ప్రతిపక్ష సభ్యులు బల్లలు చరుస్తూ మద్దతు తెలిపారు. అనంతరం రాహుల్ గాంధీని సమర్థిస్తూ, "గత 12 ఏళ్లుగా ఈ ప్రభుత్వం ముందు తలవంచని వ్యక్తి ఈ దేశంలో ఒక్కరే ఉన్నారు. ఆయనే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. ఎందుకంటే లోక్‌సభ నాయకుడు నిజం మాట్లాడటానికి వెనుకాడరు. కానీ, వారు (ప్రభుత్వం) నిజాన్ని జీర్ణించుకోలేరు" అని ప్రియాంక అన్నారు. అంతకుముందు, స్పీకర్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు స్పందించారు. రాజ్యాంగం ప్రకారం చట్టాలు, నిబంధనలకు అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ కట్టుబడి ఉండాలని అన్నారు. "ఏ వ్యక్తి అయినా తనను తాను అన్నింటికీ అతీతుడిగా భావించినప్పుడు, అతడిని నిలదీయడం చాలా ముఖ్యం" అని రాహుల్ గాంధీని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

# 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ

- మొదటి పేజి తరువాయి

పార్క్ (ఏడాదికి 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం), అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్ (ఏడాదికి 25,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యం), మచిలీపట్నంలో సమగ్ర టైటానియం, రేర్ ఎర్త్ కారిడార్‌లను ఏర్పాటు చేయాలని తమ ప్రతిపాదనలను సీఎం ముందుంచారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గనులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 20 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కోటంరెడ్డి





నెల్లూరు పెన్ పవర్ మార్చి 10. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 24వ డివిజన్, హౌసింగ్ బోర్డ్ కాలనీ పార్క్ నందు 20లక్షల రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేషన్ అధికారులు మరియు కూటమి నాయకులతో కలసి పరిశీలించిన టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి 24వ డివిజన్ అభివృద్ధికి 9 కోట్ల 80 లక్షల రూపాయల నిధులు కేటాయించాము. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. స్థానిక ప్రజల సూచనలు, అభ్యర్ధన మేరకే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. చెప్పిన మాట ప్రకారం 60 రోజుల్లో 240 పనులు పూర్తి చేసి, మార్చి 3వ వారంలో కూటమి నాయకుల సమక్షంలో ప్రజలచేతే ప్రారంభోత్సవాలు చేయిస్తాం. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సారథ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.నెల్లూరు రూరల్ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యువనేత, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ,ఆనం రామనారాయణ రెడ్డి శాసనమండలి సభ్యులు మరియు టిడిపి నెల్లూరు పార్లమెంటరీ అధ్యక్షులు బీద రవిచంద్ర నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. పై కార్యక్రమంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు అరవ శ్రీనివాసులు, క్లస్టర్ ఇంచార్జ్ కనపర్తి గంగాధర్, కో క్లస్టర్ ఇంచార్జ్ రాఘవేంద్ర, 24వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు రవి, టిడిపి నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, సలీం, గుండాల మస్తానయ్య, భాస్కర్, సుమన్, బత్తల రాము, కాపా భాస్కర్ నాయుడు, యాదగిరి, సుధాకర్, పులి హరికృష్ణ యాదవ్, వరదయ్య, శేషు, కలికి శేషారెడ్డి, ఉయ్యాల జగన్, చిట్టిబాబు, పెంచలయ్య, మనోహర్ రెడ్డి, భాస్కర్, శేషయ్య, రమేష్, శ్రీధర్ రెడ్డి, కోటేశ్వరరావు, సులమయ్య, తాటి సుధాకర్, రామయ్య, ఉడత సుధాకర్, శ్రీనివాసులు రెడ్డి, సి.హెచ్. సుధాకర్, ప్రవీణ్, సులోచన, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

## రాయలసీమ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి జిల్లా। చిత్తూరు జిల్లా। వై.ఎస్.ఆర్. కడప జిల్లా।

# మా దాన్యం డబ్బు ఇప్పించండి



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మార్చి 10. బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని ఓ రైస్ మిల్లు యజమాని గత తొమ్మిది సంవత్సరాల నుంచి ధాన్యం కొనుగోలు చేసి అందుకు సంబంధించిన డబ్బును ఇవ్వకుండా గత తొమ్మిది సంవత్సరాల నుంచి వాయిదాలు వేస్తూ తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ కొంతమంది రైతులు రైస్ మిల్ ఎదుట ధర్నాకు దిగారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి మిల్లుకు తోలానని కానీ డబ్బు ఇవ్వకపోవడంతో వేరొకరి వద్ద వడ్డీకి తీసుకొని రైతులుకు చెల్లించాలని ఓడల్లారి ఆవేదన వ్యక్తం చేశారు ఈ విషయమై తాము నాయకులకు అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ఎవరు న్యాయం చేయలేదని రైతుల ఆందోళన వ్యక్తం చేశారు ప్రస్తుతం కోతల సీజన్ ప్రారంభమైనందున మిల్లు ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం చూసి గత నాలుగు రోజుల నుంచి తమ బకాయిలు చెల్లించాలంటూ మిల్లు ఎదుట శిబిరం ఏర్పాటు చేసి ధర్నా చేస్తున్నామని అయినప్పటికీ యజమాని తమ డబ్బు చెల్లించకపోగా తన వద్ద పనిచేసే వారితో దౌర్జన్యం చేసేందుకు చూస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు ఇకనైనా కలెక్టర్ చొరవ తీసుకొని తమ న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు

# విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 12 లక్షలతో కొడవలూరులో షాది మంజిల్ పునరుద్ధరణ





కొడవలూరు పెన్ పవర్ మార్చి 10. వివాహాది శుభకార్యాల సందర్భంగా ఫంక్షన్ హాల్స్ ఖర్చులు భరించలేని ?పేద ముస్లిం కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుంది.కూటమి ప్రభుత్వ పాలనలో మైనారిటీ సంక్షేమానికి పెద్దపీట. -2025-26 ఆర్థిక సంవత్సరంలో ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం బడ్జెట్లో 5 వేల 434 కోట్లు.కూటమి ప్రభుత్వ పాలనలో మసీదులలో ఇమామ్‌లకు నెలకు 10 వేలు మౌజన్‌లకు 5 వేల రూపాయల చొప్పున గౌరవ వేతనాలను అందిస్తున్నాం. మెరుగైన పారిశుధ్య నిర్వహణ కోసం స్వచ్ఛ రథం ప్రారంభం.కొడవలూరులో వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.కొడవలూరు మండల కేంద్రంలో 12 లక్షల రూపాయల వ్యయంతో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ముస్లిం సోదరుల కోసం షాదీ మంజిల్ పునరుద్ధరణ పనులు పూర్తి చేసి ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు. కొడవలూరులో షాదిమంజిల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ వివాహాది శుభకార్యాల సందర్భంగా ఫంక్షన్ హాల్స్ ఖర్చులు భరించలేని పేద, మధ్య తరగతి ముస్లిం సోదరుల అవసరాలను గుర్తించి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో ఈ షాధీ మంజిల్ ఆధునీకరించామన్నారు. కూటమి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని 2025-26 ఆర్థిక సంవత్సరంలో ముస్లిం మైనారిటీల అభివృద్ధి కోసం బడ్జెట్లో 5 వేల 434 కోట్లు కేటాయించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ముస్లిం మైనార్టీల స్వయం ఉపాధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 173 కోట్ల 57 లక్షల రూపాయలు కేటాయించారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో మసీదులలో ఇమామ్‌లకు నెలకు 10 వేలు మౌజన్‌లకు 5 వేల రూపాయల చొప్పున గౌరవ వేతనాలను అందిస్తున్న విషయాన్ని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. అనంతరం స్థానిక స్థానిక ముస్లిం యువకులు నిర్వహిస్తున్న స్వక్షంద సంస్థ ద్వారా చేపట్టిన రైస్ బ్యాగ్ పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన పి4 విధానం ద్వారా సంపన్నులు నిరుపేదల నిరుపేదలకు సహాయం అందించడం స్వక్షంద సేవ లాంటిదేనన్నారు. ప్రజాహిత కార్యకమాలు చేసున్న యువతను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా కొడవలూరు పంచాయతీకి చెందిన చెత్త తరలించే స్వక్ష రధాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన పారిశుధ్య నిర్వహణలో పారిశుధ్య సిబ్బందితో ప్రజలు సహకరించాలని సూచించారు ఇళ్లల్లోని వ్యర్థాలు వీధుల్లో పారేయకుండా స్వక్ష రధ సిబ్బందికి అందచేసి పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం ప్రభుత్వం త్వరలో ప్రతి గ్రామానికి చెత్త తరలించే స్వచ్ఛ రథాలు అందచేయనుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులతో పాటు కొడవలూరు మండల తెలుగుదేశం మరియు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొదటి రోజే సీఐ హల్ చల్





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మార్చి 10. బుచ్చిరెడ్డిపాలెం సిఐగా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే అర్ధరాత్రి గస్తీ తిరుగుతూపిశ్రీనివాసరావువాహనాల తనిఖీల్లో నిమగ్నమయ్యారు అదే సమయంలో అర్ధరాత్రి పూట ఓ భార్యాభర్తలు నడిరోడ్డుపై తగాదా వేసుకోవడం గమనించి వారిని మందలించి పంపారు అనుమానాస్పదంగా వస్తున్న ప్రతి వాహనాన్ని ఎస్ఐ సంతోష్ రెడ్డి తోపాటు సిబ్బంది తనిఖీలు ముమ్మరంగా చేశారు అర్ధరాత్రి రెండు గంటల పైన ఈ తనిఖీలు ప్రారంభించడంతో మత్తులో ఉన్న యువకులు దొడ్డిదారుల్లో ఇళ్లకు చేరుకున్నారు ప్రతిరోజు పట్టణంలో ఇలాగే గస్తీ ఉంటుందని మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిని నిర్దాక్షిణ్యంగా అరెస్టు చేస్తానని స్పష్టం చేశారు అదేవిధంగా గంజాయి మత్తు పదార్థాలు సేవించి రోడ్లపై అల్లర్లు చేసే వారిని కూడా వదిలిపెట్టనని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

# ఎంపీ విపిఆర్ చొరవతో జేమ్స్ గార్డెన్ సమస్యలకు పరిష్కారం



నెల్లూరు పెన్ పవర్ మార్చి 10. కాంపౌండ్ వాల్ నిర్మాణంపై రైల్వే శాఖ దృష్టి ప్రజా భద్రత, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత రైల్వే ఆస్తుల రక్షణకు పటిష్ట చర్యలు నెల్లూరు నగరంలోని జేమ్స్ గార్డెన్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు విజయ్ మహల్ గేట్ వరకు ఉన్న రహదారి, రైల్వే ట్రాక్ వెంట ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తులకు రైల్వే శాఖ స్పందించింది. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో రైల్వే ట్రాక్ వెంట పరిశీలన చేపట్టి ప్రజల భద్రతకు చర్యలు తీసుకుంటోంది. జేమ్స్ గార్డెన్ నుంచి విజయ్ మహల్ గేట్ వరకు ఉన్న రహదారి, రైల్వే ట్రాక్ వెంట ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఇటీవల ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డివిజనల్ రైల్వే మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన రైల్వే శాఖ జేమ్స్ గార్డెన్ మరియు వెంకట్రామపురం రైల్వే ట్రాక్ పరిమితుల వెంబడి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రైల్వే అధికారులు సంయుక్తంగా స్థల తనిఖీ నిర్వహించి భూహద్దులు, పరిమితులను ధృవీకరించినట్లు చెప్పారు. అలాగే హై-స్పీడ్ రైళ్లను ప్రవేశపెడుతున్న నేపథ్యంలో రైల్వే భద్రతకు కాంపౌండ్ గోడల నిర్మాణం తప్పనిసరి అని, రైల్వే సరిహద్దు వెంబడి శాశ్వత కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు చురుకుగా జరుగుతున్నాయన్నారు. ఏప్రిల్ 15, 2026 నాటికి వీటి నిర్మాణం పూర్తి చేసేందుకు నిర్ణయించామన్నారు. కాంపౌండ్ వాల్ నిర్మాణం జేమ్స్ గార్డెన్ వరకు విస్తరించే పనులపై పరిశీలిస్తామన్నారు. స్థానికంగా మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రైల్వే భూమిని స్పష్టంగా గుర్తించడం, అతిక్రమణలను నిరోధించడం, అనధికార కార్యకలాపాలను అరికట్టడానికి వీలవుతుందని పేర్కొన్నారు. రైల్వే శాఖ స్పందనపై జేమ్స్ గార్డెన్ హౌస్ ఓనర్స్ అండ్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఇండ్ల వెంకట రాఘవేంద్ర, నాగేశ్వరరావు, నాగేంద్ర తదితరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను ఎంపీకి విన్నవించిన వెంటనే రైల్వే శాఖ దృష్టికి తీసుకువెళ్లారని,పరిష్కారానికి కృషి చేస్తున్న ఎంపీకి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రైతన్నల పాలిట పెద్దన్న ముఖ్యమంత్రి చంద్రన్న





విడవలూరు పెన్ పవర్ మార్చి 10. విడవలూరు మండల కేంద్రంలో ధాన్య సేకరణ కేంద్రం ప్రారంభం.మండల వ్యాప్తంగా 20 వేల 200 ఎకరాలలో వరి సాగు 65 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా.ధాన్యం విక్రయాల్లో ఏవైనా సమస్యలుంటే 1967 టోల్ ఫ్రీ నంబర్‌తో కంట్రోల్ రూమ్ కాల్ చేయండి. రైతులు పంటను కల్లం వద్దే అమ్ముకునే సరికొత్త వ్యవస్థ తీసుకొచ్చింది కూటమి ప్రభుత్వం.రైతు సమస్యలపై అవగాహన వున్న నాయకుడు దివంగత మాతూరు శ్రీనివాసులు రెడ్డి.పట్టాదార్ పాస్ పుస్తకాలు మరియు భూసార పరీక్ష పత్రాల పంపిణి. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.రైతుల కష్టానికి తగిన గిట్టుబాటు ధర దక్కాలన్నదే కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విడవలూరు మండల కేంద్రంలో ధాన్య సేకరణ కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను రైతునే అయినప్పటికీ వ్యవసాయ సంబంధ బాధ్యతలన్నీ ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారే చూస్తారని తనకు రైతు సమస్యలపై అవగాహన కల్పించింది దివంగత మాతూరు శ్రీనివాసులు రెడ్డి గారేనన్నారు. గత సంవత్సరం రబి సీజన్ సందర్భంగా ధాన్య సేకరణకు సంబంధించి మాతూరు శ్రీనివాసులు రెడ్డి గారు చూపించిన చొరవను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిఈ సందర్భంగా మననం చేసుకున్నారు. ధాన్య సేకరణలో తలెత్తే గోనె సంచుల కొరత, ట్రాన్స్ పోర్ట్ తదితర సమస్యలపై జిల్లా కలెక్టర్, సివిల్ సప్లై అధికారులు మరియు మిల్లర్లతో ఇప్పటికి పలు సార్లు చర్చించడం జరిగిందని రైతులకు అండగా నిలిచి సహాయ సహకారాలు అందించేందుకు అందరూ హామీ ఇచ్చారన్నారు. ముఖమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పాలిట పెద్దన్నలా రైతు సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక అస్తిత్వం కోల్పోయిన సాగునీటి సంఘాల ఏర్పాటు, సాగునీటి కాలువల పూడికతీత లాంటి చర్యలు రైతులకు ఎంతో ఉపయోగ పడ్డాయనన్నారు. రైతులు ధాన్య ఆరబెట్టుకునేందుకు ప్రతి మండలానికి ఒక కళ్ళం ఏర్పాటు చేస్తున్నామని కల్లాల ద్వారా తేమ శాతం లాంటి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందనన్నారు. రైతులు ఎదుర్కొంటున్న తేమ శాతం సమస్యను కలెక్టర్ హిమాన్ను శుక్లా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు వివరించారు. ఈ నెల 13 వ తేది అన్నదాత సుఖీభవ తాలూకు ఆర్థిక సహాయం అందనున్న నేపథ్యంలో ప్రతి రైతు సమీప రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ఫార్మర్ ఐడి లు చెక్ చేసుకోవాలని పేర్లు లేకుంటే వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టాదార్ పాస్ పుస్తకాలు మరియు భూసార పరీక్షా పత్రాలను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి రైతులకు అందచేశారు. అనంతరం కొడవలూరు గ్రామ పంచాయతీకి సంబంధించి 28 చెత్త తరలించే రిక్షాల ప్రారంభోత్సవంతో పాటు పారిశుధ్య కార్మికులకు 168 డస్ట్ బిన్స్ అందచేశారు. ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారిణి అనిత పాటు మండల నాయకులు ప్రభుత్వ రైతు సంక్షేమ విధానాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రైతులు మరియు విడవలూరు మండల తెలుగుదేశం మరియు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు





శ్రీకాళహస్తి , పెన్ పవర్ ,మార్చి ,10 : శ్రీకాళహస్తి రూరల్ మండలం బి.వి.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని ఈశ్వరయ్య కాలనీ మోడల్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు సన్మానించి తమ గౌరవాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బి.వి.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత గౌడ్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సత్కరించడం తమకు ఎంతో ఆనందదాయకమని తెలిపారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపి మోహన్, షకీరా, శేఖర్, వెంకట్, ఈశ్వరయ్య కాలనీ మోడల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో పూలే వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులు.



శ్రీకాళహస్తి , పెన్ పవర్, మార్చి, 10: మహిళా హక్కుల సాధనకు విద్యే సరైన ఆయుధమని, అణచివేతకు గురైన మహిళా శక్తిని ఆధునిక విద్య ద్వారానే విముక్తి చేయాలని సామాజిక ఉద్యమం చేసిన సావిత్రిబాయి పూలే ఒక సామాజిక విప్లవ జ్యోతి అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా. జి. దశరథాచారి మరియు వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి పేర్కొన్నారు. సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే మరియు ఆయన సహధర్మచారిణి క్రాంతిజ్యోతి సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని 18వ వార్డు పరిధిలోని పూసల వీధి కూడలిలో వారి చిత్రపటానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. ఎం. ఉమేష్ రావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. మహిళలను సామాజిక రుగ్మతల నుండి విముక్తి చేయడం, లింగ వివక్షను ఎదుర్కొనేలా చైతన్య పరచడం, పితృస్వామ్య వ్యవస్థ నిర్మూలన చేసి మహిళా సాధికారత సాధించడమే లక్ష్యంగా సావిత్రిబాయి పూలే 1852లో సేవా మండల్ అనే సంస్థను స్థాపించి మహిళా హక్కుల కోసం పోరాటం సాగించారని గుర్తు చేశారు. అగ్రవర్ణ దురహంకారపు కులవ్యవస్థ కారణంగా అన్యాయానికి గురైన బాలికల పరిస్థితిని మార్చేందుకు పూలే దంపతులు 'సత్యశోధక్ సమాజ్'ను ప్రారంభించి బాల్య వివాహాల నిర్మూలన, సతీసహగమనానికి వ్యతిరేకంగా పోరాటం చేయడంతో పాటు వితంతువుల పునర్వివాహాలకు బలమైన సామాజిక ఉద్యమాన్ని నడిపారని తెలిపారు. అలాగే మహారాష్ట్రలో కరువు మరియు ప్లేగు వ్యాధి తీవ్రంగా వ్యాపించిన సమయంలో ప్రజలకు అండగా నిలిచి విరాళాలు సేకరించి వైద్య శిబిరాలు నిర్వహించారని, ప్లేగు బారిన పడిన వేలాది చిన్నారులకు సేవలందించిన పూలే దంపతులు నిజమైన సామాజిక సేవకులని కొనియాడారు. ప్లేగు వ్యాధి బాధితులకు సేవలందిస్తూ అదే వ్యాధి బారిన పడి సావిత్రిబాయి పూలే మరణించడం అత్యంత విచారకరమని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యుడు ఎం. సుబ్బయ్య, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా, టీఎన్‌టీయూసీ తిరుపతి పార్లమెంటు నాయకులు వెంకటరమణ, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి, సయ్యద్ చాంద్ బాషా, గాజుల భగత్, సోంపల్లి మురళీ నాయుడు, హరి, సయ్యద్ అహ్మద్, సులేమాన్, మహమ్మద్ రఫీ, ఆనంద్, నూర్ మొహమ్మద్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# నల్ల గంగమ్మ జాతర మహోత్సవానికి సారి సమర్పించిన చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్





శ్రీకాళహస్తి, పెన్ పవర్, మార్చి ,10 : శ్రీకాళహస్తి పట్టణంలోని బహుదూర్‌పేటలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ నల్లగంగమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం తరఫున దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ సారి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆనవాయితీగా ప్రతి సంవత్సరం నల్ల గంగమ్మ తల్లి జాతరలో సారి సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అలాగే శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధితో పాటు అనుబంధ ఆలయాలు మరియు పరిసర ప్రాంతాల ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో నల్లగంగమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ కంటా రమేష్, ఆలయ బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన దేవస్థాన ఈవో వెంకటేశ్వరరావు





శ్రీకాళహస్తి, పెన్ పవర్, మార్చి ,10 : శ్రీకాళహస్తి దేవస్థాన ఈవో వెంకటేశ్వరరావు, శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, ఆలయ పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వారు చర్చించారు. ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన వసతులు కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై కూడా చర్చించినట్లు సమాచారం. ఆలయ అభివృద్ధికి అవసరమైన సూచనలు, సలహాలను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఈవోకు తెలియజేసినట్లు తెలిపారు.

ఇలాంటి కార్యక్రమాలు ఆలయ అభివృద్ధికి తోడ్పడతాయని, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.

# సావిత్రిబాయి పూలే కి ఘన నివాళు లర్పించిన చైర్ పర్సన్ శాంతి కుమారి



నెల్లూరు పెన్ పవర్ మార్చి 10. గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి మహిళా సాధికారత కోసం కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి మంగళవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో వారి చిత్రపటానికి నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి పూలమాలలు వేసి, ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి మాట్లాడుతూ భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘ సంస్కర్త బాలికల విద్య, మహిళా సాధికారత కోసం కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. ఆమె, ప్లేగు వ్యాధి సోకిన రోగులకు సేవ చేస్తూ 66 ఏళ్ల వయసులో పుణెలో కన్నుమూశారు అని ఆమె త్యాగాన్ని స్మరిస్తూ దేశవ్యాప్తంగా ఈ రోజు నివాళి అర్పించడం జరుగుతుంది. నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ తరుపున సావిత్రిబాయి పూలే ఘన నివాళులర్పిస్తున్నాము అని నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సెక్రెటరీ కుమార్ రాజా, మహిళాకవిత్రిలు, గ్రంథాలయ మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసిన అల్పాహార విందులో ఎంపీ వేమిరెడ్డి





నెల్లూరు పెన్ పవర్ మార్చి 10. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఏర్పాటు చేసిన అల్పాహార విందులో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లోనీ కల్చరల్ సెంట్రల్ లో ఆంధ్ర ప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాలకు చెందిన పార్లమెంటు సభ్యులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, జగత్ ప్రకాష్ నడ్డా, ఇతర ఎంపీలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# సి ఎం ఆర్ ఎఫ్ ద్వారా రూ.63 లక్షల సహాయం -- 84 మందికి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్




గూడూరు, పెన్ పవర్, మార్చి,10: గూడూరు నియోజకవర్గ ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్ పంపిణీ చేశారు. క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 84 మంది లబ్ధిదారులకు రూ. 63,01,952 విలువైన చెక్కులను అందజేశారు. గూడూరు పట్టణం, గూడూరు రూరల్, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన పేద కుటుంబాల వారికి ఈ సహాయం అందింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, తీవ్రమైన అనారోగ్యంతో చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం లభించిందని తెలిపారు. తమకు అందించిన ఈ సహాయాన్ని జీవితాంతం మర్చిపోమని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్






గూడూరు, పెన్ పవర్, మార్చి,10: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, స్వయం ఉపాధి కార్యక్రమాల్లో భాగంగా గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పలువురు లబ్ధిదారులకు సహాయం అందజేశారు. ఎస్ఇఆర్పి-- వెలుగు సహకారంతో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు గూడూరు మండలం నేర్నూరు గ్రామానికి చెందిన దాసరి లావణ్యకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 50 వేల విలువైన ఎగ్ కార్ట్ వెహికల్‌ను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవలను గుర్తుచేస్తూ ప్రతి సచివాలయంలో ఆయన చిత్రపటం ఉండేలా చిల్లకూరు మండలంలోని 19 గ్రామ సచివాలయాల సిబ్బందికి అంబేద్కర్ చిత్రపటాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హెల్పేజ్ కార్యక్రమం -- లబ్ధిదారులకు బియ్యం, ఫల సరుకుల పంపిణీ




గూడూరు, పెన్ పవర్, మార్చి,10: గూడూరులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెల నిర్వహించే హెల్పేజ్ కార్యక్రమం మంగళవారం ఏ ఏ ఆర్ రోటరీ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా అవసరమైన లబ్ధిదారులకు బియ్యం, ఫల సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు రోటేరియన్ వి. వెంకటేశ్వర రెడ్డి, రోటరీ హెల్పేజ్ చైర్మన్ రోటేరియన్ పి. హరిప్రసాద్, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ రోటేరియన్ మయూరి శ్యామ్ యాదవ్, రోటేరియన్ జి.జి. నాయుడు, రవికుమార్, బలరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు పాల్గొని రోటరీ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# టమోటా లోడ్ వాన్‌కు ప్రమాదం -- సురక్షితంగా బయటపడ్డ ముగ్గురు



తొట్టంబేడు , పెన్ పవర్ , మార్చి ,10 : తొట్టంబేడు మండలం ఎన్‌హెచ్--7 జాతీయ రహదారిపై మల్లిగుంట రోడ్డు సమీపంలో సోమవారం టమోటా లోడ్‌తో వెళుతున్న టాటా ఏసీ వ్యాన్ టైరు పగలడంతో అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. వాహనంలో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు ప్రయాణికులు ఉన్నారు. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ సురక్షితంగా బయటపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల తెలిపిన వివరాల ప్రకారం, వాహనం అతివేగంగా వెళుతుండగా ఒక్కసారిగా ముందరి టైరు పగలడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయి వాహనం రోడ్డుపై ఒరిగి బోల్తా పడినట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని వాహనంలో ఉన్న వారిని బయటకు తీసి సహాయం చేశారు. ఘటన కారణంగా కొంతసేపు జాతీయ రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం స్థానికులు, ప్రయాణికుల సహకారంతో వాహనాన్ని రోడ్డుపక్కకు జరిపి ట్రాఫిక్‌ను సవ్యంగా సాగేటట్లు చేశారు. ఈ ప్రమాదంతో వాహనం కొంత మేరకు దెబ్బతిన్నట్లు సమాచారం. పోలీసులు ఘటనపై విచారణ చేపట్టినట్లు తెలిసింది.

# తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ -- టౌన్ ప్లానింగ్‌లో ఏసీబీ సోదాలు

తిరుపతి : పెన్ పవర్, మార్చి, 10: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీబీ ఏఎస్పి విమల కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సోదాలు నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బిపిఎస్, ఎల్ఆర్ఎస్ స్కీం కోసం నగరంలో ఉండే లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారుల నుంచి టౌన్ పని విభాగం అధికారులు డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారని ఏసీబీకి ఫిర్యాదులు వెళ్లాయి.

దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు టౌన్ ప్లానింగ్ విభాగంలో ప్రతి ఒక్కరిని ఏసీబీ అధికారులు ఫైళ్లను తనిఖీ చేయడమే కాకుండా వారి దగ్గర జేబులో ఎంత నగదు ఉందో వారి దగ్గర తీసుకొని ఆరా తీస్తున్నారు. సోదాలు ఇంకా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో ఏసీబీసీ మల్లికార్జున్‌తోపాటు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ అధికారులు, సచివాలయ టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు ఉన్నారు.

# రమాదేవి మల్టీస్పెషల్టి హాస్పిటల్ వెంటనే సీజ్ చేయండి.

## --సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్.

తిరుపతి క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, మార్చి 10. తిరుపతి నగరంలోని స్థానిక భవాని నగర్ లో ఉన్న రమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను వెంటనే సీజ్ చేయాలని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మంగళవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ పలమనేరు మండలం జీడిమకుల పల్లికి చెందిన శ్రీనివాస్ అనే యువకుడు బ్రెయిన్ స్ట్రోక్ తో తొమ్మిది రోజుల క్రితం హాస్పిటల్లో అడ్మిషన్ అయినప్పటికీ 3 లక్ష రూపాయలు యాజమాన్యం వసూలు చేయడం జరిగిందని వివరించారు. చివరకు ఠాగూర్ తరహా వైద్యం అందించి తల్లిపుస్తుల తాకట్టు పెట్టి హాస్పిటల్లో ఫీజు చెల్లించిన కుటుంబ సభ్యులు మరణించినప్పటికీ ఏమాత్రం మానవత్వం చెప్పుకుంటా 45 వేల రూపాయలు చెల్లించాలని మంగళవారం ఉదయం నుంచి మృతదేహాన్ని అంటిపెట్టుకొని దందా నడిపిన ఆసుపత్రి యాజమాన్యం ఏ మాత్రం మానవత్వం లేకపోవడంతో పాటు సంబంధిత ఎమ్మెల్యే ఫోన్ చేసిన స్పందించకుండా నిర్లక్ష్యంగా మాట్లాడి డబ్బులు వసూలు చేసిన హాస్పిటల్ పై హాస్పిటల్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వెంటనే విచారణ చేపట్టి హాస్పిటల్ పై విచారణ చేపట్టి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. పేదల రక్తాన్ని జలగల్లాగా రక్తం తాగుతున్న రమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పై నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని సిపిఐ గా





డిమాండ్ చేస్తున్నదని రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. హాస్పిటల్ పై చర్యలు తీసుకొని పక్షంలో తాము ఆందోళన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దానికి తోడు జిల్లా వైద్యానికి శాఖ అధికారులు కూడా ప్రైవేట్ హాస్పిటల్ పై నిర్లక్ష్యం వహించడం బాధ్యత రహితంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇంకనైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విచారణ చెప్పటాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ పార్టీగా తీవ్రంగా ఖండిస్తూ ఆ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# గరుడ వారధి పై ద్విచక్ర వాహనాలకు నో ఎంట్రీ.

## స్మార్ట్ సిటీ అమలులో ప్రభుత్వ అధికారుల నిర్ణయం.

తిరుపతి క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, మార్చి 10. తిరుపతి గరుడ వారధి పై ఇక ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారు తిరుపతి జిల్లా అధికారులు. మంగళవారం జరిగిన స్మార్ట్ సిటీ అమలు లో భాగంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ, కార్పొరేషన్ కమిషనర్ ల కీలక నిర్ణయం తీసుకున్నారు. తరచు రోడ్డు ప్రమాదాల బారిన పడిన ద్విచక్ర వాహనదారులు మృతి చెందడం జరుగుతుందన్నారు తిరుపతి స్మార్ట్ సిటీ అమలులో భాగంగా ఈ రోజు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, మున్సిపల్ కమిషనర్ మౌర్య, సంబంధిత విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. అందులో వివిధ అంశాలతో పాటు గరుడ వారధి పైన జరిగే రోడ్డు ప్రమాదాల పైన చర్చించడం జరిగింది. గరుడ వారధి ప్రారంభమైన నాటి నుండి ఇప్పటివరకు జరిగిన ప్రమాదాల వివరాలను పరిశీలించి ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాల కారణంగా ప్రమాదం జరుగుతున్నట్లు గుర్తించడం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రజల భద్రతే ధ్యేయంగా గరుడ వారధి పై ద్విచక్ర వాహనాలు మరియు భారీ ట్రాన్స్పోర్ట్ వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించడం జరిగింది. ప్రజల భద్రత దృష్ట్యా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ నిబంధనను ఖచ్చితంగా పాటించి ప్రమాదాల నివారణకు సహకరించ వలసిందిగా కోరడమైనది.




నిబంధనలు ఉల్లంఘించిన వారి పై తగు చర్య పట్టనున్నట్లు తెలిసింది.

# శబ్ద కాలుష్యం వాహనాలపై రవాణా శాఖ కొరడా.

## నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై 1,50,000 అపరాదం.






తిరుపతి క్రైమ్ బ్యూరో, పెన్ పవర్,మార్చ్ 10. శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు తిరుపతి మోటార్ వాహన తనిఖీ అధికారులు,తిరుమల ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో నిబంధనలు ఉల్లంఘించిన పలు వాహనాలపై అపరాధ రుసుంపేశారు. అధిక శబ్దం చేసే మార్పు చేసిన సైలెన్సర్లు ఉపయోగిస్తున్న ద్విచక్ర వాహనాలు ఇతర వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి తనిఖీలు నిర్వహించారు. అధికంగా శబ్ద కాలుష్యాన్ని వెలువరిస్తున్న జీపులు మరియు ఇతర రవాణా వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ......మోటార్ వాహన చట్టంలోని 1988 యాక్ట్ ప్రకారం వాహనాల్లో అనుమతించిన డేసిబెల్స్ పరిమితిని మించిపోయే విధంగా శబ్దం చేసే సైలెన్సర్లు ఉపయోగించడం నేరంగా పరిగణించబడుతుందని తెలిపారు.ముఖ్యంగా చట్టంలోని సెక్షన్ 190(2) ప్రకారం ఈ నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులపై కేసులు నమోదు చేసి, తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సిఐ హరి ప్రసాద్ తెలిపారు. తిరుమల వంటి ఆధ్యాత్మిక ప్రాంతంలో అధిక శబ్దం భక్తులకు, స్థానిక ప్రజలకు అసౌకర్యం కలిగించడంతో పాటు పర్యావరణానికి కూడా హానికరం అవుతుందని ఈ నేపథ్యంలో శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.ల తనిఖీల సమయంలో అనుమతించిన ప్రమాణాలకు విరుద్ధంగా మార్పులు చేసిన సైలెన్సర్లు ఉన్న వాహనాలను గుర్తించి, వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన చోట్ల జరిమానాలు విధించారు. అలాగే వాహనదారులు తమ వాహనాలను మోటార్ వాహన చట్టం ప్రకారం నిర్వహించుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజల సౌకర్యం దృష్ట్యా వాహనదారులు అనుమతించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న సైలెన్సర్లను మాత్రమే ఉపయోగించాలని, అనధికార సైరన్ లను ఉపయోగించరాదని అధికారులు విజ్ఞప్తి చేశారు. శబ్ద కాలుష్యాన్ని తగ్గించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజలు స్వచ్ఛందంగా వాహన నియమాలను పాటించి సహకరించాలని కోరారు. ఇలాంటి తనిఖీలు భవిష్యత్తులో కూడా తిరుపతి మరియు తిరుమల ప్రాంతాల్లో కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ తనిఖీలలో రవాణా వాహనాలపై 25 వాహన తనిఖీ రసీదులు నమోదు చేయడం జరిగింది.

అపరాధ రుసుముగా 1,50,000 వసూలు చేయడం జరిగింది. మూడు సంవత్సరాలుగా త్రైమాసిక పన్నుచెల్లించని టెంపో ట్రావెలర్ పై లక్ష రూపాయలు జరిమానా విధించడం జరిగింది.ఈ తనిఖీలలో తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, మోటార్ వాహన తనిఖీ అధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, మోహన్ కుమార్ ,రమణ నాయక్, అతికానాజ్ , స్వర్ణలత ప్రసాద్ వర్మ పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ప్రశాంతి రెడ్డి ఘన నివాళులు





కోవూరు పెన్ పవర్ మార్చి 10. భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా మహిళా అభ్యున్నతి కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషి అభినందనీయం అన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్ లోని ఆమె నివాసంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళా విద్య కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషిని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కొనియాడారు. అడ్డంకులు, అవమానాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా మహిళలకు విద్యను అందించిన ధీశాలిగా సావిత్రిబాయి అభివర్ణించారు.

నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే దానికి సావిత్రి బాయి పూలె వేసిన పునాదులే కారణమని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని సామాజిక సమానత్వం కోసం పాటుపడాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# ఘనంగా సావిత్రి బాయి పూలే వర్ధంతి వేడుకలు.

## సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకు కృషి చేయాలి,ఫాతిమా షేక్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి...ప్రజా సంఘాల డిమాండ్

గూడూరు, పెన్ పవర్, మార్చి,10: గూడూరు పట్టణ ఆర్అండ్ బీ కార్యాలయ సమీపంలోని పూలే దంపతుల విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పూలే దంపతుల విగ్రహాలకు, ఫాతిమా షేక్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ షేక్ మహబూబి, శారదమ్మ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్ సేవలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. మహిళా విద్య తోనే కుటుంబ అభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమని 300 ఏళ్ల క్రితమే దృఢమైన సంకల్పంతో బాలికా విద్యకు శ్రీకారం చుట్టిన మహనీయులు పూలే దంపతులు అన్నారు. ఆ దంతులకు ఆశ్రయం కల్పించి తన ఇంటిని స్కూల్ గా మార్చి ఆమె చదువుకుని భారత దేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలిగా ఫాతిమా షేక్ కీర్తి గడించారన్నారు. ఆ నాటి సమాజంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొని నిలవబడడంతో నేడు మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులకు సమానంగా రాణిస్తున్నారని అన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విద్యార్థుల పాఠ్యాంశంగా ఫాతిమా షేక్ చరిత్రను పొందుపరచాలని డిమాండ్ చేశారు. అనంతరం సావిత్రిబాయి ఆశయాలను సాధిద్దాం, ఫాతిమా షేక్ ఆశయాలను సాకారం చేద్దాం, ప్రజా సంఘాల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు నాశిన భాస్కర్ గౌడ్, ఎల్వీ. సుబ్బయ్య, వెంకటేశ్వర్లు






రాజు, సీపీఐ నాయకులుసీ హెచ్. ప్రభాకర్, జీ. శశి కుమార్, షేక్ జమాలుల్లా, గుండాల రమేష్, కే. నారాయణ, కాంగ్రెస్ నాయకులు నాయకుల ఫయాజ్, పర్వతాల శ్రీనివాసులు గౌడ్, షేక్. ఇబ్రహీం, జీ. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి మహిళకు నారీ శక్తి పురస్కారం...

## ప్రైమ్ 9 టీవీ సౌజన్యంతో అవార్డు..

## వృత్తిపరమైన సేవలు ఫుడ్ సర్వీసెస్ టెక్నాలజీ విభాగాల్లో ప్రతిభ..

## ఏపీ వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ చంగల్ రాయలు అభినందనలు...






రేణిగుంట: మార్చి 10,పెన్ పవర్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి అర్బన్ మండలం లో టైపిస్టుగా విధులు నిర్వహిస్తున్న బి లక్ష్మీదేవి ప్రతిష్టాత్మక నారీశక్తి అవార్డు అందుకున్నారు. ప్రైమ్ నైన్ న్యూస్ ఛానల్ సౌజన్యంతో నిర్వహించిన వేడుకల్లో వివిధ రంగాల్లో ఆమె అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు.

బహుముఖ ప్రజ్ఞకు గుర్తింపు..

లక్ష్మీదేవి కేవలం ప్రభుత్వ కార్యాలయానికే పరిమితం కాకుండా ఫుడ్ సర్వీస్ మరియు ఫ్రెండ్స్ టెక్నాలజీ వంటి విభాగాల్లో సాంకేతికతను జోడించి ఉత్తమ సేవలు అందించారు. ఒక మహిళగా సవాళ్లను ఎదుర్కొంటూ అటు వృత్తిని ఇటు సామాజిక బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తున్న ఆమె తీరు పలువురికి ఆదర్శంగా నిలిచింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును ప్రధానం చేశారు.

అభినందనల జల్లు..

లక్ష్మీదేవి ఈ పురస్కారాన్ని అందుకోవడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వీఆర్వో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జి చంగల్ రాయలు ప్రత్యేకంగా స్పందించారు. ఆమెను ఘనంగా అభినందిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

కష్టపడే తత్వం పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధ్యమని లక్ష్మీదేవి నిరూపించారు. ప్రభుత్వ విభాగాల్లో టైపిస్ట్ గా బాధ్యతలు నిర్వహిస్తూనే ఇతర రంగాల్లో కూడా చురుకుగా ఉంటూ ' నారీ శక్తి' అవార్డును సొంతం చేసుకోవడం మా అసోసియేషన్ కు మరియు తిరుపతి జిల్లాకు గర్వకారణం మని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఆమె మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకొని మహిళల్లోకానికి స్ఫూర్తిగా నిలవాలి అని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ అధికారులు మహిళా సంఘాల ప్రతినిధులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొని లక్ష్మీదేవికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఈ నెల 17న సీఎం చంద్రబాబు నాయుడుపేట పర్యటన

## టిడ్కో ఇళ్లను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు : కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్







నాయుడుపేట , పెన్ పవర్, మార్చి 10 ఈ నెల 17వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయుడుపేట పట్టణం లో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు.మంగళవారం నాయుడుపేట మండలంలోని టిడ్కో ఇళ్లు ప్రాంతాలను స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ,మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం,జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు తదితరులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయుడుపేటలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ప్రారంభించేందుకు రానున్నారని తెలిపారు.అందులో భాగంగా హెలిప్యాడ్,సభా స్థలాలను కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన డిపార్ట్మెంట్ అధికారులు శానిటేషన్,మొక్కలు నాటడం,విద్యుత్,ఆర్ అండ్ బి, ఇతర సంబంధిత శాఖల సమన్వయంతో ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, నాయుడుపేట పట్టణ టీడీపీ అధ్యక్షులు,మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ,నాయుడుపేట ఎ ఏం సి చైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట

ఇంచార్జి ఉయ్యాల ప్రవీణ్,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, తెలుగు దేశం పార్టీ నాయకులు అవదానం సుధీర్,పసల గంగా ప్రసాద్,పలుకూరు ముత్యాలయ్య,వినుకొండ ధనుంజయ,నిత్య కృష్ణారెడ్డి, మొండెం బాబు,చిట్టెటి రేవతి,పలువురు నాయకులు, మున్సిపల్ కమీషనర్ షేక్ ఫజులుల్లా,పలువురు అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగంలో అధిక దిగుబడులు సాధిస్తూ రైతన్నలకు ఆదర్శంగా కామిరెడ్డి మార్క్...





పెళ్లకూరు, పెన్ పవర్, మార్చి 10 ప్రతి మనిషికి పట్టుదల కావాలి, చేసే ఏ పనిలోనైనా మెలకువలు పాటించాలి అప్పుడే అనుకున్న ఉత్తమ ఫలితాలు సాధించవచ్చనే వైయస్సార్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి,మాజీ డిసిసిబి చైర్మన్ కామిరెడ్డి నిరూపించారు. పెళ్లకూరు మండల పరిధిలోని చిల్లకూరు గ్రామంలో ఉంటూ అటు ప్రజాసేవలోనూ, ఇటు వైయస్సార్ పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్నా! అన్నదాతగా వరి సాగులో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ అధిక దిగుబడులు వచ్చే విధంగా వ్యవసాయంలో తనదైన శైలిలో వరి సాగు చేస్తున్నారు. ఈ ఏడు ఖరీఫ్ సీజన్ లో ఆయనకున్న45 ఎకరాల పొలంలో కొత్త వరి వంగడాలైనా ఆర్ ఎన్ ఆర్ క్రాస్77 నంబరు రకం తెలంగాణ నుండి తెచ్చి వరి వంగడాలతో సాగు చేశారు. వరి నారు నాటిన నాటి నుండి అధిక దిగుబడులకు ఏ కాలంలో ఏ రకమైన రసాయనిక, సేంద్రియ ఎరువులను వాడలో సమాచారం సేకరించారు. వ్యవసాయ అధికారుల సలహాలతో పాటుగా రైతు బిడ్డగా ఆయనకున్న అనుభవం మేరకు వరిపై చీడ పీడలు చేరకుండా నిత్యం పరిశీలిస్తూ, సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యతనిస్తూ, భూసారం దెబ్బతినకుండా పరిమితిగా రసాయనిక ఎరువులను వాడారు. షుగర్ లెస్ రకంగా పిలవబడే ఆర్ఎన్ఆర్ 17048 సన్న రకం వేసిన 1 ఎకరం పొలంలో ఎవరు ఊహించని రీతిగా అత్యధిక దిగుబడి75 కిలోలు బస్తాలు 65 వరకు దిగుబడి సాధించి గుర్తింపు పొందారు. ఈ పరిసర ప్రాంతంలో ఒక ఎకరం పొలంలో అధిక దిగుబడి 45 బస్తాలను మించకుండా ఉంటే దానిని కామిరెడ్డి బద్దలు కొట్టి65 బస్తాలు దిగుబడి సాధించి అందరూ చర్చించుకునేలా ఉత్తమ రైతుగా నిలిచారు. వరి సాగులో ఏపుగా పెరిగిన కలుపు మొక్కలను సైతం బయట వేయకుండానే వాటిని భూమిలో కలిపి భూ సాంద్రత పెరిగేందుకు తగు జాగ్రత్తలు పాటించారు. నేడు ఆర్ఎన్ఆర్ రకం బస్తా ధర1791.75తో విక్రయించడం విశేషం. అధిక దిగుబడి సాధించిన కామిరెడ్డిని మండల రైతులు అభినందించడమే కాకుండా, అనేకులు ఆయన పాటించిన సలహాలు, సూచనలు, అవలంబించిన పద్ధతులను తెలియజేస్తే, రబీ సీజన్ లో 17048 ఆర్ఎన్ఆర్ రకం వేసి అధిక దిగుబడులు సాధించాలని సన్నద్ధమవుతున్నారు. ఏది ఏమైనా ఎవరు ఊహించని విధంగా వరి సాగులో ఉత్తమ దిగుబడులు సాధించడంతో 20బస్తాలు చిల్లకూరులోని బండ్లమ్మ గుడి ఆవరణంలో వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టకు విరాళంగా అందజేశారు. మండలంలోని అన్నదాతల ప్రశంసలు అందుకుంటున్నారు. వైయస్సార్ పార్టీ రైతు విభాగం నుండి కూడా ప్రశంసలు అందుకున్నారు.

# మత సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలు నిర్వహించుకోవాలి- జెసి డాక్టర్ నిధి మీనా



కడప పెన్ పవర్, మార్చి, 10: మత సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలు నిర్వహించుకోవాలని జెసి డాక్టర్ నిధి మీనా పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రంజాన్, ఉగాది, శ్రీరామనవమి పండుగల నిర్వహణపై జెసి అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. రాజంపేట సబ్ కలెక్టర్ భావన, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, అడిషనల్ ఎస్పి ప్రకాష్ బాబు, బద్వేలు, పులివెందుల ఆర్ఒలు చంద్రమోహన్, చిన్నయ్య, కడప మున్సిపల్ కమిషనర్ రాకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మత సంప్రదాయాలను గౌరవిస్తూ శాంతియుత, ఆహ్లాదకర వాతావరణంలో రంజాన్, ఉగాది, శ్రీరామనవమి పండుగలను నిర్వహించుకునేలా జిల్లా శాంతి కమిటీ సభ్యులు సమన్వయ సహకారాలు అందించాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పండుగ ఏర్పాట్లు, ఉత్సవాలు సజావుగా జరిగేలా ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. మత సామరస్యానికి ప్రతీకగా అన్ని మతాల ప్రజల సహకారంతో మజీద్‌లు, ఈద్గాలు, ఆలయాల వద్ద ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ప్రార్థనలు, పూజలు జరిగేలా చూడాలన్నారు. ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారులకు, పోలీసు సిబ్బందికి సమాచార ఇవ్వాలని పేర్కొన్నారు. అనవసరమైన విషయాలను అత్యుత్సాహంతో సోషల్ మీడియాలలో పోస్టు చేస్తే శాంతి కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో మైనారిటీ శాఖ జిల్లా అధికారి హిదియతుల్లా,శాంతి కమిటీ సభ్యులు, పోలీసు శాఖ, వివిధ శాఖల అధికారులు, దేవాదాయ శాఖ, మైనారిటీ అధికారులు, అలయ అర్చకులు, మౌజమ్‌లు పాల్గొన్నారు.

# 13న వైవీయూ స్నాతకోత్సవం రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్




కడప అర్బన్ పెన్ పవర్, మార్చి, 10:యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా నాలుగు కాన్వొకేషన్లు ఒకేసారి ఈ నెల 13న నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ తెలిపారు. విశ్వవిద్యాలయం 11వ (2020-21), 12వ (2021-22) 13వ (2022-23),14వ (2023-24) కాన్వకేషన్ల నిర్వహణకు కడపలోని యోగివేమన విశ్వవిద్యాలయం సిద్ధమైందన్నారు. సి.పి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్వొకేషన్‌లో 1,194 పీజీ పట్టభద్రులకు, డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రతిభావంతులకు 176 బంగారు పతకాలు, 70 మంది పరిశోధకులకు పిహెచ్‌డి అవార్డులు అందజేయనున్నామన్నారు. నాలుగేళ్లకు కలిపి మరో ఇద్దరు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లు ఇవ్వనున్నామన్నారు. విద్యార్థుల పట్టాలు అందజేసే మహోన్నత కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారని తెలిపారు. ఈ కాన్వకేషన్‌లో ఇన్ ఆప్సెన్షిసియా కింద 11,664 మంది డిగ్రీ విద్యార్థులు డిగ్రీలను అందుకోనున్నారని వివరించారు. కాన్వొకేషన్ విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్. వి. కృష్ణారావు, బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య పార్వతి, విశ్వవిద్యాలయ పబ్లిక్ రిలేషన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పి.సరిత, డాక్టర్ టి.సురేష్ బాబు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గంటాఊరు శ్రీతిరుపతి గంగమ్మకు ప్రత్యేక పూజలు



పలమనేరు,పెన్ పవర్, మార్చి 10, పలమనేరు మున్సిపల్ పరిధిలోని గంటావూరు బీసీకాలనీ నందు వెలసిన శ్రీతిరుపతి గంగమ్మకు సోమవారం దేవాలయం చైర్మన్ మురుగన్ ఆధ్వర్యంలో విశేషమైన పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు మహిమాన్వితమైన అమ్మవారి ఆలయంలో ఉదయం అభిషేకం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ఆలయ ధర్మకర్త,ఆలయ చైర్మన్ సేవారత్న స్వర్ణ నంది అవార్డు గ్రహీత డాక్టర్ మురుగన్ మరియ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అలాగే సాయంత్రం 4గంటలకు వన్నియకుల క్షత్రియ కోఆపరేటివ్ ఫైనాన్స్ స్టేట్ చైర్మన్ డాక్టర్ సి.ఆర్.రాజన్ ఆలయంలో అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఈసందర్భంగా ఆయనకు చైర్మన్ ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం జ్వాలాదీప ప్రజ్వలన, అమ్మవారికి ఊంజల్ సేవ తర్వాత తిరిగి భక్తులకు అన్నదానం నిర్వహించారు.ఈసందర్భంగా వేలాదిమంది భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

# అనుమానాస్పద స్థితిలో యువతి మృతి



వి.కోట (చిత్తూరు) : పెన్ పవర్, మార్చి, 10: మండల పరిధిలోని బిసి పల్లెకు చెందిన సోమశేఖర్ కుమార్తె వైష్ణవి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మంగళవారం మృతురాలి కుటుంబీకుల కథనం మేరకు .... వైష్ణవికి గత రెండు రోజులుగా వాంతులు విరేచనాలు అవుతుండటంతో తీవ్రంగా నీరసించిన ఆమె సోమవారం ప్రభుత్వ ఆసుపత్రి వచ్చి వైద్యం చేయించుకొని తిరిగి ఇంటికి వెళ్లింది. ఆ రోజు అర్ధరాత్రి సమయం దాటిన తరువాత వైష్ణవి పరిస్థితి విషమించడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో వి.కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. బిడ్డ మృతితో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. వైష్ణవికి మూడేళ్ల క్రితం చింతలగుంటకు చెందిన శివతో ప్రేమ వివాహమైంది. వీరికి ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. ఆమె మృతి విషయాన్ని వైద్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో అర్జీల శవయాత్ర కార్పొరేషన్ ఎదుట నిరసన




కడప. పెన్ పవర్, మార్చి, 10:నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు అర్జీలు సమర్పించినా ఫలితం లేకపోవడంతో వినూత్న రీతిలో శవయాత్ర చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్ పేర్కొన్నారు. మంగళవారం కార్పొరేషన్ ఎదుట అర్జీల పాడేతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా పట్టించుకునే నాధుడే కరువయ్యారని చెప్పారు. పేదల సమస్యలు నగరపాలక అధికారులకు పట్టవా అని ప్రశ్నించారు. రంజాన్ మాసంలో నమాజులకు వెళ్లాలన్నా వీధుల్లో సరైన విద్యుత్ దీపాలు లేవని పేర్కొన్నారు. పాములు, విష పురుగులు తిరుగుతున్నా ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా సమస్యలను గాలికి వదిలేశారన్నారు. దోమలు, పందులు విష కీటకాలు తిరుగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. రెండవ డివిజన్‌లోని డంపింగ్ యార్డ్ వద్ద నివసిస్తున్న ప్రజానీకం ఒక నిమిషం కూడా ఆ దుర్వాసనకు భరించలేని పరిస్థితి ఉందని చెప్పారు. ఆ దుర్వాసనలో రాత్రంతా తాను ప్రజల కోసం ఉండడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. మీరు సిద్ధమా అని అధికారులను ప్రశ్నించారు. నగర కమిషనర్ సమస్యల పరిష్కారానికి 20 వరకు గడువు ఇచ్చామని, అప్పటికీ స్పందించకపోతే సమస్యలపై పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో మహిళా నాయకులు అమీదా ఖానం, గౌరీ, 48వ డివిజన్ అంజన్, 27 డివిజన్ శామీర్, 43వ డివిజన్ జాబిర్ అలీ, 2వ డివిజన్ యూసుఫ్, 44వ డివిజన్ సిద్దిక్ , 39వ డివిజన్ హాజీ, 31 డివిజన్ సాదిక్, నాలుగో డివిజన్ సుబ్రహ్మణ్యం, 36వ డివిజన్ అన్వర్, ఐదో డివిజన్ ఫజరూల్లా, 33వ డివిజన్ కరీం, 47 డివిజన్ మహబూబ్ బాషా, 43 వ డివిజన్ ఖాజా పీర్, ఫహీం, నగర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రుల కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగుల నిరాహారదీక్ష



కడప : పెన్ పవర్, మార్చి, 10: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు జన విజ్ఞాన వేదిక సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం, నగర కార్యదర్శి నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .... ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. రోగుల సంరక్షణ, శుభ్రత నిర్వహణ, వైద్య సేవలకు అవసరమైన అనేక పనులను నిర్వర్తిస్తూ ఆసుపత్రుల వ్యవస్థను నడిపించడంలో వీరి సేవలు అత్యంత ముఖ్యమని తెలిపారు. ముఖ్యంగా పేద, సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ వైద్యసేవలు నిరంతరంగా కొనసాగడానికి వీరి కఅషి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇంత ముఖ్యమైన సేవలు అందిస్తున్నప్పటికీ ఈ ఉద్యోగులు తగిన భద్రత లేకుండా, తక్కువ వేతనాలతో, అనిశ్చిత పరిస్థితుల్లో పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 50 ఏళ్ల పైబడిన ఉద్యోగుల భవిష్యత్తు భద్రత కోసం పెన్షన్ సదుపాయం కల్పించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే ఈ ఉద్యోగుల శ్రమను గుర్తించి వారికి సామాజిక భద్రత, న్యాయమైన వేతనాలు, గౌరవప్రదమైన సేవా పరిస్థితులు కల్పించడం ప్రభుత్వ బాధ్యతని తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఈ ఉద్యమాలు మరింత విస్తరించే అవకాశం ఉందని హెచ్చరించారు. జన విజ్ఞాన వేదిక కార్మికుల న్యాయమైన పోరాటాలకు ఎప్పటికీ మద్దతుగా ఉంటుందని పేర్కొన్నారు.

# ఎంఇఓ పై సమగ్ర విచారణ చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ




కడప. పెన్ పవర్, మార్చి, 10: ప్రయివేట్ విద్యా సంస్థల యాజమాన్యాలకు కొమ్ము కాస్తున్న పోరుమామిళ్ల మండల విద్యాశాఖ అధికారి వెంకటయ్య పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జాల సుమంత్, వీరపోగు రవి కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరుమామిళ్ల మండలంలోని ప్రయివేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా చదువు పేరుతో విద్యార్థుల, వారి తల్లిదండ్రుల దగ్గర అధిక ఫీజులతో దోపిడీ చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. పైగా వారి దగ్గర ముడుపులు తీసుకుంటూ వారి పక్షాన వ్యవహరిస్తున్న ఎంఇఓ వెంకటయ్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలుమార్లు విద్యాశాఖ అధికారికి సమాచారం ఇచ్చిన ఇంతవరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. చదువు పేరుతో మోసం చేసే వారిపై చర్యలు తీసుకునే అధికారిగా ఉంటూ వారికి తొత్తుగా వ్యవహరించడం సరికాదని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులకు సమస్య గురించి విన్నవించుకున్న లెక్క చేయని విధంగా ప్రవర్తించడం సరికాదని చెప్పారు.

# 'బలమైన' హామీ సాకారానికి లోకేష్ భూమి పూజ!

**హైదరాబాద్ పెన్ పవర్:** గత ఎన్నికలకు ముందు మంగళగిరి నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీలను మంత్రి నారా లోకేష్ నెరవేరుస్తున్నారు. తాజాగా గత ఎన్నికల సమయంలో ఇక్కడి నదీతీర ప్రాంతం వాసుల సమస్యలు పరిష్కరించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తామని చెప్పారు. దీనికి సంబంధించి తాజాగా భూమి పూజ చేయడం గమనార్హం. తాడేపల్లి రిటైనింగ్ వాల్‌కు శంకుస్థాపన చేయడంతో స్థానికంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ రక్షణ గోడ నిర్మాణానికి 294 కోట్ల రూపాయలు ఖర్చుచేయనున్నారు.మంగళగిరి నియోజకవర్గం పరిధిలోని తాడేపల్లిలో ప్రకాశం బ్యారేజీ దిగువన రెండున్నర కిలో మీటర్ల మేరకు కృష్ణా నది కుడివైపున ఈ వరద రక్షణ గోడను నిర్మించనున్నారు. ఇది ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి లోకేష్ పెద్దపీట వేసినట్టు అయింది. దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న ఈ ప్రాజెక్ట్ కు కేవలం ఏడాది కాలంలోనే 294 కోట్ల రూపాయల పరిపాలన అనుమతులు సాధించడమే కాకుండా టెండర్ ప్రక్రియను కూడా పూర్తిచేశారు. భవిష్యత్ లో భారీ వరదలను దృష్టిలో పెట్టుకుని 15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని తట్టుకునేలా పటిష్టమైన డిజైన్ తో రిటైనింగ్ వాల్ ను నిర్మించనున్నారు.

**బలమైన కట్టడం!**

కేవలం సాధారణ గోడగా కాకుండా భూమి లోపల 26 నుంచి 38 మీటర్ల లోతు వరకు 1,920 పైల్స్ వేసి, పైల్- రాఫ్ట్ సాంకేతికతతో భూకంపాలను, నీటి ఉధృతిని తట్టుకునేలా నిర్మించనున్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తైతే సుందరయ్య నగర్, మహానాడు కాలనీ వంటి లోతట్టు ప్రాంతాల్లో నివసించే దాదాపు 50 వేల మంది ప్రజలు వరద భయం నుంచి శాశ్వతంగా విముక్తి పొందుతారు. అమరావతి రాజధాని పరిధిలోని కీలక ప్రాంతాలకు, జాతీయ రహదారి-65కు రక్షణగా రిటైనింగ్ వాల్ నిలవనుంది.



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఇరాన్-ఇజ్రాయిల్ వార్ : ఏపీ ఎగుమతిదారులకు లాస్, ఎలా అంటే?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయల్ కొనసాగిస్తున్న యుద్ధంతో ఏపీ రైతులు కుదేలవుతున్నారు. యుద్ధం కారణంగా పశ్చిమాసియాకు ఎగుమతి కావాల్సిన ఆహారోత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు చెబుతున్నారు. ఒక్క ఏపీ మాత్రమే కాకుండా తెలంగాణ, హరియాణా, కర్ణాటక, పంచాబ్, మహారాష్ట్రకు చెందిన రైతులు కూడా నష్టపోతున్నారని మార్కెట్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏపీ నుంచి రొయ్యలు, బియ్యం పెద్ద ఎత్తున పశ్చిమాసియాకు ఎగుమతి చేస్తుంటారు. అదేవిధంగా పండ్లు, కూరగాయలు, చేపలు, మాంసం ఉత్పత్తులు సైతం ఆయా రాష్ట్రాల నుంచి ఎగుమతి అవుతుంటాయి. యుద్ధంతో హోర్ముజ్ జలసంధి మూసివేయడంతో పోర్టుల్లో సరుకు పేరుకుపోయిందని అంటున్నారు.మన దేశ మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో ఐదు వంతు పశ్చిమాసియా దేశాలకు వెళుతోందని చెబుతున్నారు. గత ఏడాది పశ్చిమాసియా దేశాలకు భారత్ నుంచి ఒక లక్షా 8 వేల 898 కోట్ల రూపాయల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. ఇందులో దాదాపు 40 వేల కోట్ల రూపాయల విలువైన బియ్యం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఎగుమతి చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. హార్మోజ్ జలసంధి మూసివేయడంతో ఆ మార్గం గుండా సరుకు రవాణా చేసే నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మన దేశంలోని పోర్టుల్లో 4 లక్షల టన్నుల బాస్మతి బియ్యం నిల్వలు పేరుకుపోయినట్లు చెబుతున్నారు.ముఖ్యంగా కొన్ని నౌకలు నడి సంద్రంలో ఉండిపోయాయి. యుద్ధం మరికొంతకాలం కొనసాగితే నౌకల్లో ఉన్న రొయ్యలు, చేపలు, మాంసం ఉత్పత్తులు పాడయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మనం ఉత్పత్తి చేసే బాస్మతి బియ్యం ఎక్కువగా సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్ దేశాలు కొనుగోలు చేస్తున్నాయి. యుద్ధం వల్ల ఆ దేశాలకు బాస్మతి బియ్యం ఎగుమతి సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ప్రత్యామ్నాయ మార్కెట్లకు ఆ సరుకును తరలించే అవకాశం కనిపించడం లేదు. దీంతో స్థానికంగా ధరలు పతనమయ్యే ప్రమాదంతోపాటు రైతులకు కనీసం పంట ఉత్పత్తికి అయ్యే ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యుద్ధం వల్ల మన దేశం నుంచి దుబాయ్, ఇతర అరబ్ దేశాలకు ఎగుమతి అయ్యే పండ్లు, మాంసం ఉత్పత్తులు, గుడ్లు, పాలు వంటి ఎగుమతులు నిలిచిపోయాయని అంటున్నారు. యుద్ధం ప్రారంభం కాకముందు నుంచే ఉద్రిక్తతల కారణంగా ఎగుమతులు 50 శాతం క్షీణించాయి. యుద్ధం మొదలైన తర్వాత ఇవి పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పండ్లు, గుడ్లు, మాంసం ఉత్పత్తుల ధరలు పతనమయ్యే పరిస్థితి కనిపిస్తోందని ఆందోళన వ్యక్తమవుతోంది.

**రంజాన్ వేళ.. ఎగుమతుల్లో స్తబ్దత**

మన దేశం నుంచి ఎగుమతి అవుతున్న మాంసం, రొయ్యలు, పండ్లు, కూరగాయలు గల్ఫ్ దేశాలకు నిలిచిపోయాయి. దీంతో ఆయా దేశాల్లో రంజాన్ వేళ స్టాక్ తగ్గిపోయి స్తబ్ధత ఏర్పడిందని అంటున్నారు. రంజాన్ సమయంలో ఇఫ్తార్ విందులో భాగంగా ఎక్కువగా మాంసం, పండ్లు వినియోగిస్తారు. యుద్ధం కారణంగా ముస్లిం దేశాలు అయిన ఓమన్, కువైట్, సౌదీ, దుబాయ్ వంటి దేశాల నుంచి ఆర్డర్లు లేవని, నౌకలు కూడా అటువైపు వెళ్లడం లేదని చెబుతున్నారు. ఇదేసమయంలో పోర్టుల్లో నిలిచిపోయిన నౌకలు డెమరేజ్ చార్జిల భారం తడిపిమోపెడు అవుతోందని ఆవేదన చెందుతున్నారు. దీంతో ఎడాపెడా నష్టాలు ఎదురవుతున్నాయని స్థానికంగా రైతులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## హీరో శివాజీ.. అవసరమా ఈ మాటలు?

**హైదరాబాద్ పెన్ పవర్:** స్క్రిప్ట్ ప్రకారం అయితే ఆయనకు ఇప్పుడు కావాల్సింది మంచి పాత్రలు, హిట్ సినిమాలు... కానీ కెమెరా ముందు నటన కన్నా కెమెరా వెనుక రాజకీయ విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లున్నారు నటుడు శివాజీ. సినిమాలో విలన్‌ని ఎదుర్కోవడం ఎంత బాగుంటుందో రాజకీయాల్లోకి వెళ్లకుండానే విలనిజాన్ని ఎంచుకోవడం అంతకంటే రిస్క్ అని ఈయన ఎప్పుడు గుర్తిస్తారో! తెలుగు సినీ పరిశ్రమలో తనదైన శైలి నటనతో సహజమైన డైలాగ్ డెలివరీతో ఒకప్పుడు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు శివాజీ. సుదీర్ఘ విరామం తర్వాత 'బిగ్ బాస్' వంటి కార్యక్రమాల ద్వారా మళ్లీ పాపులర్ అయిన ఆయన ఇప్పుడు సినిమాల్లో కూడా బిజీ అవుతున్నారు. అయితే ఒక నటుడిగా తన రెండో ఇన్నింగ్స్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్న శివాజీ.. ప్రస్తుతం తెరపై కంటే తెర వెనుక రాజకీయ చర్చల వల్లనే ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై ఆయన చేస్తున్న సంచలన వ్యాఖ్యలు, ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఉద్దేశించి ఆయన చేస్తున్న విమర్శలు ఇప్పుడు సినీ, రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీస్తున్నాయి.

**రాజకీయ నిష్పాక్షపాతం.. ఆచరణలో ప్రశ్నార్థకం?**

శివాజీ తాను ఏ రాజకీయ పార్టీకి చెందినవాడిని కాదని.. తనకు ఏ పార్టీతోనూ అంటకాగాల్సిన అవసరం లేదని పదే పదే చెబుతుంటారు. కానీ ఆయన మాటలు మాత్రం పరోక్షంగా ఒక నిర్దిష్ట రాజకీయ పక్షానికి... అంటే తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ఉన్నాయనే భావన రాజకీయ పరిశీలకుల్లో బలంగా వ్యక్తమవుతోంది. ఒక నటుడిగా ప్రజా సమస్యల మీద స్పందించడం తప్పు కాదు... కానీ తన మాటలు రాజకీయంగా ఒక పక్షానికి అనుకూలంగా, మరొక పక్షానికి వ్యతిరేకంగా ఉండటం వల్ల ఆయన 'నిష్పాక్షపాతం'పై అనుమానాలు మొదలయ్యాయి. ఒకరిని విమర్శించడం, సవాళ్లు విసరడం వంటివి ఆయన ఇమేజ్‌ను ఒక 'పొలిటికల్ యాక్టివిస్ట్' స్థాయికి తీసుకువెళ్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

**రెండో ఇన్నింగ్స్.. సినిమాలపైనే దృష్టి పెట్టాల్సిన సమయం**

ప్రస్తుతం శివాజీకి నటుడిగా మంచి అవకాశాలు వస్తున్నాయి. క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కీలక పాత్రల్లో ఆయన తన ప్రతిభను చాటుకుంటున్నారు. ప్రేక్షకుల్లో కూడా ఆయనపై ఒక సానుకూల దృక్పథం పెరుగుతోంది. ఇలాంటి కీలక తరుణంలో సినిమాలపై, తన నటనపై పూర్తి దృష్టి పెట్టాల్సిన శివాజీ అనవసరమైన రాజకీయ వివాదాల్లో తలదూర్చడం వల్ల కలిగే లాభం ఏమిటనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. రాజకీయ వ్యాఖ్యల వల్ల ఆయనకు లభించే క్రేజ్ తాత్కాలికం కావచ్చు కానీ ఒక నటుడిగా ఆయనకు వచ్చే గుర్తింపు చిరస్థాయిగా ఉంటుంది. వివాదాలు నటుడిని నటుడిగా కాకుండా ఒక వర్గానికి ప్రతినిధిగా చూసే ప్రమాదం ఉంది. ఇది ఆయన సినీ కెరీర్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు సినీ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**సోషల్ మీడియా హోరు..వాస్తవ పరిస్థితి ఏమిటి?**

నేటి కాలంలో సోషల్ మీడియాలో ఏ చిన్న వ్యాఖ్య చేసినా దానికి అనంతమైన ప్రతిస్పందనలు వస్తుంటాయి. శివాజీ రాజకీయ వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో కొన్ని వర్గాల నుంచి భారీ మద్దతు లభిస్తోంది. అయితే ఈ మద్దతు ఇచ్చేది నిజమైన అభిమానులా లేక రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసే వర్గాలా అన్నది అంతుచిక్కని ప్రశ్న. ఇలా సోషల్ మీడియాలో పరస్పర విమర్శలు, రెచ్చగొట్టుకోవడం వల్ల సామాజికంగా లేదా రాజకీయంగా ఎటువంటి ప్రయోజనం చేకూరదని చివరికి ప్రత్యర్థులకు అనవసరమైన పబ్లిసిటీని కట్టబెట్టడమే అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**కెరీర్‌పైనే మక్కువ చూపితేనే మంచిది!**

ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తికి తమ అభిప్రాయాలను వెల్లడించే హక్కు ఉంది. అయితే ఒక బాధ్యతాయుతమైన నటుడిగా, లక్షలాది మంది అభిమానులు ఉన్న వ్యక్తిగా శివాజీ తన వ్యాఖ్యల వల్ల కలిగే పరిణామాలను ఆలోచించుకోవాలి. రాజకీయాల్లోకి వెళ్లకపోయినా రాజకీయ వ్యాఖ్యలు చేయడం వల్ల వచ్చే వివాదాలు కెరీర్‌ను దెబ్బతీస్తాయి. ఇప్పటికైనా ఆయన రాజకీయ వివాదాలకు దూరంగా ఉండి.. తన నటనతో ప్రేక్షకులను అలరించడంపైనే దృష్టి సారిస్తే బాగుంటుందనేది మెజారిటీ అభిమానుల ఆకాంక్ష. నటుడిగా ఆయనకు ఉన్న సహజమైన ప్రతిభ, ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణ ఆయనకు మంచి భవిష్యత్తును అందిస్తాయి. శివాజీ తన కెరీర్ పట్ల మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తారనేది అందరి ఆశ.

## ఇది ఏపీ పోలీసు రివేంజ్? బిహార్ లో దెబ్బకు రిటర్న్ గిఫ్ట్?

**హైదరాబాద్ పెన్ పవర్:** డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో బిహార్ కేడర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ విచారణపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. హైకోర్టు సూచనల ప్రకారం సునీల్ నాయక్ ను గత ఐదు రోజులుగా విజయనగరం ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక పోలీసు అధికారుల బృందం విచారిస్తోంది. అంతేకాకుండా విచారణను మరో మూడు రోజులు పొడిగించింది. దీంతో బిహార్ లో ఎదురైన అవమానానికి రివేంజ్ తీర్చుకునేలా, రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేలా సిట్ పోలీసులు సునీల్ నాయక్ విచారణను కొనసాగిస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.బిహార్ లో సునీల్ నాయక్ ను అరెస్టు చేసేందుకు వెళ్లిన ఏపీ పోలీసు బృందానికి అక్కడ హోంగార్డులు ఇబ్బందులు సృష్టించారని, ఘర్షణ వైఖరి అవలంబించి కస్టడీలో ఉన్న సునీల్ నాయక్ ను తమతో తీసుకువెళ్లిపోయారని చెబుతున్నారు. అంతేకాకుండా ఓ మహిళా అధికారి ఇష్టానుసారం తిట్టారన్న ప్రచారం జరిగింది. దీనిపై రివేంజ్ తీర్చుకునేలా ప్రస్తుతం సునీల్ నాయక్ విచారణ కొనసాగుతోందా? అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. పోలీసు విచారణను పరిశీలిస్తే గతంలో సిట్ అధికారులు ఎదుర్కొన్న పరాభవానికి ఇప్పుడు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేలా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సునీల్ నాయక్ ను అరెస్టు చేయాలనే పట్టుదల పోలీసు అధికారుల్లో కనిపిస్తోందని, అందుకే బెయిలు తీర్పు వచ్చే వరకు విచారణను పొడిగిస్తూ వస్తున్నారని న్యాయవాద వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.రఘురామరాజు అరెస్టు సమయంలో సునీల్ నాయక్ డీఐజీగా ఉన్నారు. అప్పట్లో ఏం జరిగింది? సునీల్ నాయక్ కు ఏం తెలుసు అన్న విషయాలపై సుదీర్ఘంగా విచారణ జరుగుతోంది. అయితే ఇదే కేసులో నిందితుడు అయిన మరో సీనియర్ అధికారి పీ.వీ.సునీల్ కుమార్ ను కేవలం ఒక రోజు, అది కూడా కేవలం నాలుగు గంటల పాటు విచారించి వదిలేశారని గుర్తు చేస్తున్నారు. కానీ ఐపీఎస్ సునీల్ నాయక్ విషయంలో మాత్రం సిట్ పోలీసులు రోజుల తరబడి విచారణ కొనసాగించడమే ఇంట్రెస్టింగు డిస్కషన్ కు తెరతీస్తోంది. ఆయన వ్యవహారశైలిపై ఏపీ పోలీసు అధికారులు గుర్రుగా ఉన్నారని, అందుకే విచారణను సుదీర్ఘంగా కొనసాగిస్తూ తమ చుట్టూ సునీల్ నాయక్ తిరిగేలా చేస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.బిహార్ రాజధాని పట్నాలో సునీల్ నాయక్ ను గతంలో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. అయితే నిబంధనలను చూపి ట్రాన్సిట్ వారెంట్ జారీ కాకుండా అక్కడి పోలీసులు సునీల్ నాయక్ ను ఏపీ తరలించకుండా అడ్డుకున్నారు. అంతేకాకుండా ఆ సమయంలో ఏపీ పోలీసులపై ఎదురు కేసులు పెట్టడం, ఒకానొక సమయంలో దాడికి ప్రయత్నించినట్లు ప్రచారం జరిగింది. దీనిని స్థానిక కోర్టు దృష్టికి తీసుకువెళ్లిన పోలీసులు సునీల్ నాయక్ ను విచారించేందుకు అనుమతి తీసుకున్నారు. దీంతో ఈ నెల 5వ తేదీ నుంచి ఆయన రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుంటూరు సీసీఎస్ పోలీసుస్టేషన్ లో విచారణకు హాజరవుతున్నారు. తొలుత 9వ తేదీవరకు సునీల్ నాయక్ విచారణకు కోర్టు అనుమతి ఇచ్చింది. ఆయన విచారణకు సహకరించడం లేదని కోర్టు దృష్టికి తీసుకువెళ్లడంతో మరో మూడు రోజులు సిట్ ఎదుట హాజరు కావాలని కోర్టు సూచించింది.



దీంతో ఈ నెల 12వ తేదీ వరకు సునీల్ నాయక్ విచారణ కొనసాగుతుందని చెబుతున్నారు.ఇదంతా పరిశీలిస్తే గతంలో విచారణకు హాజరుకాకపోవడం, బిహార్ లో తమకు సహకరించకపోవడాన్ని సిట్ పోలీసులు సీరియస్ గా తీసుకున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ కారణంగానే సీనియర్ అధికారిని విచారణ పేరుతో రోజూ తమ వద్దకు రప్పించుకుంటున్నారని అంటున్నారు. సునీల్ నాయక్ ముందస్తు బెయిలుపై హైకోర్టు తీర్పు వచ్చేవరకు ఈ పరిస్థితి కొనసాగుతుందని అభిప్రాయపడుతున్నారు. హైకోర్టులో సునీల్ నాయక్ ముందస్తు బెయిలుపై తీర్పు వచ్చిన తర్వాత అరెస్టు చేయాలా? వద్దా? అని నిర్ణయం తీసుకుని విచారణ ముగిస్తారని అంటున్నారు. దీంతో మరో రెండు రోజులు కూడా సునీల్ నాయక్ విచారణ కొనసాగుతుందని, 12వ తేదీన హైకోర్టు ఆదేశాలతో ఈ పరిస్థితిలో మార్పు రావొచ్చని అంటున్నారు.

## పశ్చిమ ప్రకాశం లో వైసీపీ వీక్ అయిందా ?

**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీకి భారీ ఓటమి బాధలు ఇంకా తీరలేదా అన్న చర్చ నడుస్తోంది. ఎందుకంటే ఆ పార్టీకి కీలకమైన జిల్లాలలో ఇంకా కోలుకోకపోవడమే అని అంటున్నారు. ఇక జగన్ అంటేనే పశ్చిమ ప్రకాశంగా చెబుతారు.అలాగే పశ్చిమ ప్రకాశం అంటే జగన్ అనే విధంగా అక్కడ రాజకీయం ఉంటుంది. అలాంటి పశ్చిమ ప్రకాశంలో ఇపుడు వైసీపీ రాజకీయాలు భిన్నంగా సాగుతున్నాయని అంటున్నారు. పశ్చిమ ప్రకాశం మార్కాపురం జిల్లాగా మారింది. మొత్తం నాలుగు నియోజకవర్గాలు ఈ జిల్లాలో ఉన్నాయి. ఇక ఇందులో మూడు జనరల్ ఓసీ అయితే ఒకటి ఎస్సీగా ఉంది. అదే ఎర్రగొండపాలెం. ఇక మిగిలినవి చూస్తే మార్కాపురం, గిద్దలూరు, కనిగిరిగా ఉన్నాయి.



**వారిదే డామినేషన్ :**

ఇక చూస్తే పశ్చిమ ప్రకాశంలో రెడ్డి సామాజిక వర్గానిదే డామినేషన్ అంటారు. అంటే జనాభా పరంగా వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. కానీ ఇక్కడ జగన్ అమలు చేస్తున్న స్ట్రాటజీ అయితే ఏ మాత్రం వర్కౌట్ కావడంలేదు అని అంటున్నారు. కనిగిరిలో పూర్తిగా రెడ్లు ఉంటారు. కానీ అక్కడ సీటు యాదవ సామాజిక వర్గానికి జగన్ ఇచ్చారు. టీడీపీ తరపున రెడ్డి అభ్యర్థి ఉన్నారు. దాంతో సామాజిక వర్గం సమీకరణలతో రెడ్డికే అంతా జై కొట్టారు. అయితే ఇక్కడ యాదవ సామాజిక వర్గం కూడా మూడవ ప్లేస్ లో ఉంది. అయితే ఇక్కడ ఓటర్లలో కానీ మార్కాపుపురంలో కానీ పూర్తిగా రెడ్లే ఉంటారు. అలాగే అక్కడ వైశ్య సామాజిక వర్గానికి సీటు ఇస్తే టీడీపీ రెడ్లకు ఇచ్చింది. దాంతో అక్కడ కూడా వైసీపీ వ్యూహమేదీ వర్కౌట్ కాలేదని చెబుతారు

**సీన్ మొత్తం అంతే :**

ఇక చూస్తే గిద్దలూరులో నాన్ లోకల్ ని వైసీపీ హైకమాండ్ ఇంచార్జి ఇచ్చారు. కానీ రెడ్డి సామాజిక వర్గమంతా సబ్ క్యాస్ట్ ఆ అభ్యర్థికి లేవు. కానీ అక్కడ అంతా సబ్ క్యాస్ట్ కే మొదటి ప్రాధాన్యత ఇస్తారు. అలా గిద్దలూర్లో అయితే ఆ పార్టీ ఇంచార్జి అసలు గ్రామ కమిటీలు కూడా వేయలేకపోతున్నారు అన్న విమర్శలు ఉన్నాయి. దాంతో ఇంకా చాలా గ్రామాలు ఖాళీగా ఏ కమిటీలు లేకుండా ఉన్నాయని అంటున్నారు. ఇక ఆయన ఉండేది మార్కాపురంలో గిద్దలూరుకి చుట్టపు చూపుగా వస్తూ పోతూ ఉన్నారు అంటున్నారు. దాంతో గిద్దలూరులోని వైసీపీ క్యాడర్ అయితే ఇంచార్జిని నమ్మడం లేదని అంటున్నారు. దాంతో ఆయనకే 2029లో టికెట్ వస్తుందా లేదా అన్నది కూడా చాలా మంది అనుకుంటున్న నేపధ్యం ఉంది.

**పార్టీలోనే వ్యతిరేకత :**

ఇక మార్కాపురంలో అయితే ఇంచార్జికి గ్రామంలో ఉన్న రెడ్డి సామాజిక వర్గం నాయకులకు అసలు సపోర్టు చేయడం లేదని అంటున్నారు. ఎందుకంటే గతంలో ఆ ఇంచార్జికి అక్కడి రెడ్డి సామాజిక వర్గం నేతలకు పడడం లేదని భావించే గిద్దలూరు నుంచి వచ్చి మార్కాపురంలో పోటీ చేశారు అని గుర్తు చేస్తున్నారు. అయితే అక్కడ మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు. వారి వర్గం కూడా బలంగా ఉంది. అందుకే ఆయనకు మద్దతు ఇవ్వవద్దని అని బహిరంగానే వైసీపీ నేతలు చెబుతున్నారని టాక్ నడుస్తోంది. దాంతో అక్కడ కూడా చాలా ఇబ్బందిగా ఉంది అని అంటున్నారు.

**కనిగిరిలోనూ ఇబ్బందిగానే :**

ఇక కనిగిరి నియోజకవర్గంలో అయితే గతంలో ఎమ్మెల్యేగా ఉన్న వారి వర్గీయులు ప్రస్తుతం ఇంచార్జికి ఏ మాత్రం మద్దతు ఇవ్వడం లేదు, పైగా బాహాటంగా వ్యతిరేకిస్తున్నారు. ఇంచార్జి తీరు పట్ల అక్కడ రెడ్డి సామాజిక వర్గం గుర్రుగా ఉనంటున్నారు అని చెబుతున్నారు. ఇక కనిగిరి ఇంచార్జికి డబ్బులు సమస్యగా ఉంది అని అంటున్నారు. ఇదే విషయం పెద్ద ఎత్తున డిస్కషన్ గా ఉంది. కనిగిరి ఒక్కటే కాదు మార్కాపురం, గిద్దలూరు ఇంచార్జిలు కూడా డబ్బులు తీయడం లేదు అని పార్టీలోనే కామెంట్స్ ఉన్నాయి.

**ఈయన ఒక్కడే బెస్ట్ :**

ఇక యెర్రగుండపాలెం ఎస్సీ ఎమ్మెల్యే మాత్రం బెస్ట్ అని అంటున్నారు. ఆయన అందరికీ నియోజకవర్గంలో కలుపుకుని పోతున్నారు అని చెబుతున్నారు. అందరితో మంచి సంబంధాలు నెరుపుతున్నారు అని నియోజకవర్గం క్యాడర్ ఎబుతోంది. ఇక వైసీపీ హైకమాండ్ కి ఆయన మీద మంచి నివేదికలు వెళ్ళాయని అంటున్నారు అలా యెర్రగొండపాలెం ఎమ్మెల్యేకు జగన్ దగ్గర మంచి మార్కులే పడుతున్నాయని అంటున్నారు. దాంతో అతనికి ఏ ఇబ్బంది ఉండదని వచ్చే ఎన్నికల్లో టికెట్ ఖాయమని అంటున్నారు.

**మూడు సీట్లూ ఫోకస్ పెట్టాల్సిందే :**

అయితే కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లలో మూడు అసెంబ్లీ సీట్ల మీద వైసీపీ అధినాయకత్వం ఫోకస్ పెట్టాల్సిందే అని అంటున్నారు. మార్కాపురం, కనిగిరి, గిద్దలూరూ ఈ మూడు సీట్లను బలమైన రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వాలని కోరుతున్నారు ఇంచార్జిలుగా ఉన్న వారు జనంతో ఉండాలని క్యాడర్ ని కలుపుకుని పోవాలని డబ్బులు ఖర్చు పెట్టాలని కోరుతున్నారు. లేకపోతే ఇబ్బంది అవుతుందని అంటున్నారు. ఈ ముగ్గురు ఇంచార్జిల పనితీరు మీద గుర్రుగా ఉన్న క్యాడర్ అయితే వారిని మార్చాలని తామే హైకమాండ్ ని కోరుతామని కూడా అంటున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఈ నియోజకవర్గాలలో కనుక మార్పులు చేసి బలమైన రెడ్లని ఇంచార్జులుగా నియమిస్తే వైసీపీకి తిరుగు ఉండదని అంటున్నారు. దాంతో మార్కాపురం జిల్లాలో నాలుగు అసెంబ్లీ సీట్లను వైసీపీ గెలుచుకుని తీరుతుందని వైసీపీ అంటున్నారు. మరి హై కమాండ్ ఈ విషయంలో ఏ రకమైన నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది అని అంతా చర్చిన్ చర్చించుకుంటున్నారు.

# వరల్డ్ కప్ ఫైనల్‌లో గొడవ.. అర్ష్‌దీప్ సింగ్‌కి షాక్ ఇచ్చిన ఐసీసీ






**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా నంబర్--1 టీ20 బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ బిగ్ షాక్ ఇచ్చింది. పొట్టి ప్రపంచకప్ 2026 ఫైనల్లో న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ పట్ల ప్రవర్తించిన తీరుపై భారీగా ఫైన్ విధించింది. మ్యాచ్ ఫీజ్ లో 15 శాతం కోత పెట్టడంతో పాటు ఓ డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది. గత 24 నెలల్లో ఇదే ఫస్ట్ తప్పిదం కావడంతో అర్ష్‌దీప్ మ్యాచ్ నిషేధం ప్రమాదాన్ని తప్పించుకున్నాడు. పూర్తి వివరాల్లోకి వెళితే.. తాజాగా ముగిసిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో డారిల్ మిచెల్ పైకి అర్ష్‌దీప్ ప్రమాదకరంగా బంతిని విసిరాడు. ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్న ఐసీసీ అతడిపై కఠిన చర్యలు చేపట్టింది. వాస్తవానికి డారిల్ మిచెల్ పై అర్ష్‌దీప్ అంత సీరియస్ గా బంతిని విసరాల్సిన పని లేదు.. ఫాలో అప్ లో భాగంగా బాల్ ని వికెట్లపైకి విసరడంతో ప్రమాదవశాత్తు అది మిచెల్ కి గట్టిగా తాకింది. ఆ సమయంలో మిచెల్ సైతం సహనాన్ని కోల్పోవడంతో.. అర్ష్‌దీప్ అతన్ని పట్టించుకోకుండా తాను బౌలింగ్ చేసేందుకు వెళ్లిపోయాడు. దీంతో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సర్ది చెప్పడంతో ఆ గొడవ అంతటితో ఆగిపోయింది. ఈ ఘటన జరిగిన తర్వాత మిచెల్ కి క్షమాపణలు చెప్పిన అర్ష్‌దీప్ షేక్ హ్యాండ్ ఇచ్చి హగ్ చేస్తున్నారు.

ఇలాంటి ఘటనలు ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ లోని ఆర్టికల్ 2.9 రూల్స్ ఉల్లంఘన కిందికి వస్తాయి. దీని ప్రకారం, బంతి లేదా ఇతర క్రికెట్ సామగ్రిని మరో ప్లేయర్ వైపు అనుచితంగా లేదా ప్రమాదకరంగా విసరడం తప్పు.. ఇందుకు తగిన మూల్యాన్ని అర్ష్‌దీప్ చెల్లించుకున్నాడు. ఇక ప్రపంచకప్ ఫైనల్లో కివీస్ పై భారత్ 96 పరుగుల తేడాతో గెలిచి వరుసగా రెండో టీ20 వరల్డ్ కప్ ని సొంతం చేసుకుంది. మొత్తంగా ఐదో ప్రపంచకప్ లని టీమిండియా ఇప్పటి వరకు (1983, 2011 (వన్డే), 2007, 2024, 2026 (టీ20)) కైవసం చేసుకుంది.

# హార్దిక్ కుటుంబంలో చిచ్చు పెట్టిన మహికా శర్మ.. విడిపోతున్న పాండ్యా బ్రదర్స్..?

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా కుటుంబంలో అతడి గర్ల్ ఫ్రెండ్ మహికా శర్మ చిచ్చు పెట్టింది. ఇద్దర అన్నదమ్ముల ( హార్దిక్-- కృనాల్ పాండ్యా) మధ్య విభేదాలు వచ్చాయా అనే చర్చ ప్రస్తుతం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్ 2026 తర్వాత అభిమానులు గమనించిన కొన్ని విషయాలు ఈ ఊహాగానాలకు బలం చేకూర్చుతున్నాయి. వరల్డ్ కప్ గెలిచిన తర్వాత దేశవ్యాప్తంగా సంబరాలు జరిగాయి.. ఈ టోర్నీలో హార్దిక్ పాండ్య కీలక పాత్ర పోషించాడు. ఈ విజయానికి సంబంధించిన పోస్టులు లేదా అభినందనలు అతని అన్న క్రునాల్, వదిన పంకురి శర్మ నుంచి నెట్టింట ఎక్కడ కనిపించకపోవడంతో ఫ్యాన్స్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు, ఫైనల్ మ్యాచ్ లో కృనాల్ పాండ్యా, ఆయన భార్య స్టేడియంలో కనిపించకపోవడం ఈ చర్చకు మరింతగా వైరల్ అవుతుంది. దీంతో ఇద్దరు సోదరుల మధ్య ఏమైనా విభేదాలు వచ్చాయా అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కొంతమంది ఫ్యాన్స్ అభిప్రాయం ప్రకారం.. హార్దిక్ పాండ్యా-- మోడల్ మహికా శర్మ మధ్య ఉన్న సన్నిహిత సంబంధం వల్లే ఈ పరిస్థితికి కారణమై ఉండొచ్చని పేర్కొంటున్నారు. 25 ఏళ్ల మహికా శర్మ టీ20 వరల్డ్ కప్ మొత్తం హార్దిక్‌తో కలిసి ప్రయాణిస్తుస్తూ స్టేడియంలో అతనికి సపోర్టు చేసింది. ముంబైలోని వాంఖెడే స్టేడియంలో ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ సమయంలో హార్దిక్ కుమారుడు అగస్త్య పాండ్య కూడా మహికాతో కలిసి మ్యాచ్‌ను వీక్షించాడు. హార్దిక్ 12 బంతుల్లో 27 పరుగులు చేసి అవుట్ కావడంతో అగస్త్య కొంత నిరాశకు గురైనట్లు కనిపించగా, మహికా అతన్ని ఓదార్చిన దృశ్యాలు కూడా నెట్టింట వైరల్ అయ్యాయి. ఫైనల్ లో గెలిచిన అనంతరం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో హార్దిక్-- మహికా రొమాన్స్ చేసుకోవడం తీవ్ర




విమర్శలకు దారి తీసింది. సోషల్ మీడియాలో ఈ విషయంపై ఫ్యాన్స్ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఇది కేవలం ఊహాగానం మాత్రమే అంటున్నారు. నెట్టింట పోస్టులు పెట్టకపోతే కుంటుంబంలో విభేదాలు ఉన్నాయని అనుకోవడం సరైంది కాదు.. ఫ్యామిలిలో చిన్న చిన్న మనస్పర్ధలు వస్తుంటాయని ఒక యూజర్ రాసుకొచ్చాడు. మరో వ్యక్తి ఇలా కామెంట్ పెట్టాడు.. హార్దిక్ గత ఏడాది నుంచి వేరుగా ఉంటున్నాడు.. మహికాతో జరిగిన ఎంగేజ్‌మెంట్‌కు కూడా కృనాల్‌ను ఆహ్వానించలేదని తెలుస్తుందని పేర్కొన్నాడు. అయితే ఒక ప్రేమ ఇద్దరి అన్నదమ్ముల మధ్య బంధాన్ని విడదీసిందని మరో నెటిజన్ కామెంట్ చేశాడు. అయితే, ఇప్పటి వరకు హార్దిక్ పాండ్యా గానీ కృనాల్ పాండ్యా కానీ ఈ విషయంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దాంతో ప్రస్తుతం జరుగుతున్న చర్చ అంతా అభిమానుల ఊహాగానాలకే పరిమితమైంది.

# రెండ్రోజుల పాటు బాగా తిని, హాయిగా నిద్రపోతా: సూర్యకుమార్ యాదవ్

**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ వంటి మెగా టోర్నీని గెలిచిన తర్వాత మీ తదుపరి ప్రణాళిక ఏంటి? అని అడిగితే ఏ కెప్టెన్ అయినా తర్వాతి సిరీస్‌ల గురించో, భవిష్యత్ సవాళ్ల గురించో చెబుతారు. కానీ టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం చాలా సరదాగా, సింపుల్‌గా సమాధానమిచ్చాడు. “ప్రస్తుతానికి నా ప్లాన్ ఒక్కటే. ఇంటికి వెళ్లి, మంచి భోజనం చేసి, రెండ్రోజులు హాయిగా నిద్రపోవాలి. ఆ తర్వాతే మిగతా విషయాల గురించి ఆలోచిస్తా” అని తన తక్షణ కర్తవ్యాన్ని వెల్లడించాడు. స్వదేశంలో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో గెలిచి, ఈ ఘనత సాధించిన తొలి ఆతిథ్య జట్టుగా చరిత్ర సృష్టించిన ఆనందంలో ఉన్న సూర్య... ముంబైలోని తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడాడు. ఈ విజయం జట్టు సభ్యులదే కాదు, అభిమానులది కూడా అని అన్నాడు. “మీరంతా మాతో సమానంగా సంబరాలు చేసుకున్నారు. మీ అందరికీ అభినందనలు. భారత్‌లో ప్రపంచకప్ గెలవడం చాలా ప్రత్యేకమైన అనుభూతి. ఎంతో మంది మద్దతు, ప్రార్థనల వల్లే ఇది సాధ్యమైంది” అని తెలిపాడు. ఈ విజయం వెనుక మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ప్రోత్సాహం ఎంతో ఉందని సూర్య గుర్తు చేసుకున్నాడు. “2024లో రోహిత్ కెప్టెన్సీలోనే మేం టీ20 ప్రపంచకప్ గెలిచాం. ఆ తర్వాత అతడు కెప్టెన్సీ నుంచి తప్పుకున్నప్పుడు నాపై పూర్తి నమ్మకం ఉంచాడు. గత రెండేళ్లుగా ఈ జట్టును విజయవంతంగా నడిపించాను. ఇప్పుడు ప్రపంచకప్ కూడా గెలిచాం. నాపై రోహిత్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టడం చాలా ఆనందంగా ఉంది. ఈ విజయం యావత్ భారతదేశానిది” అని సూర్య వివరించాడు. టోర్నమెంట్‌కు ముందు రోహిత్ వ్యాఖ్యలను కూడా సూర్య పంచుకున్నాడు. “మీ జట్టు చాలా బాగుంది. ధైర్యంగా ఆడండి. గెలుపు మీదే అవుతుంది” అని రోహిత్ చెప్పిన మాటలు తమలో స్ఫూర్తి నింపాయని అన్నాడు.



ప్రస్తుత విజయంతోనే ఆగిపోమని, భవిష్యత్ లక్ష్యాలపై తమకు స్పష్టమైన ప్రణాళిక ఉందని సూర్య వెల్లడించాడు. “2028లో జరగనున్న ఒలింపిక్స్‌లో క్రికెట్ తరఫున దేశానికి స్వర్ణ పతకం అందించడమే మా తదుపరి లక్ష్యం. అదే ఏడాది మరో టీ20 ప్రపంచకప్ కూడా ఉంది. కాబట్టి హ్యాట్రిక్ ప్రపంచకప్‌లు గెలిచేందుకు మా వంతు కృషి చేస్తాం” అని ధీమా వ్యక్తం చేశాడు. ప్రపంచకప్ గెలిచిన రాత్రి జరిగిన సంబరాల గురించి చెబుతూ... “ఆ రాత్రి మేం ఏం చేశామో చెప్పాలనుంది కానీ... ఉదయం 8 గంటల వరకు మేల్కొనే ఉన్నాం. ఒక టీమ్‌గా గెలిచినప్పుడు సంబరాలు కూడా కలిసే చేసుకోవాలి. అందుకే మేమంతా కలిసే ఆనందాన్ని పంచుకున్నాం” అని సూర్య తెలిపాడు. వరుసగా రెండుసార్లు (2024, 2026) ఐసీసీ టోర్నీలు గెలవడంతో తమపై ఒత్తిడి ఉన్నప్పటికీ, సరైన సమయంలో రాణించామని సూర్య పేర్కొన్నాడు. ఒత్తిడి లేకపోతే ఆటలో మజా ఉండదని వ్యాఖ్యానించాడు. ముంబై చేరుకున్న తర్వాతే ప్రపంచకప్ గెలిచామనే అసలైన భావన కలుగుతోందని, ఈ ఆనందం చాలాకాలం పాటు తనతోనే ఉంటుందని చెప్పుకొచ్చాడు. తన క్రికెట్ ప్రయాణం మొదలైన ముంబైని ఎప్పటికీ వీడనని, తాను భారతీయుడిగా గర్విస్తున్నానని సూర్య పేర్కొన్నాడు.

# ‘బేబీ’ జంట కొత్త మూవీ.. ఫస్ట్ సింగిల్ విన్నారా?

టాలీవుడ్ యంగ్ క్యాస్టింగ్ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్ నుంచి రిలీజ్ అయిన ఫస్ట్ సింగిల్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సంచారమే అంటూ సాగుతున్న ఆ పాట మంచి రెస్పాన్స్ అందుకుంటా.. సూపర్ మెలోడీగా మెప్పిస్తోంది. సినిమా కథలోని మెయిన్ రోల్స్ ఎమోషనల్ జర్నీని సాంగ్ క్లియర్ గా చూపిస్తోంది.

ఆ పాటకు ప్రముఖ కవి, రైటర్ గోరటి వెంకన్న లిరిక్స్ అందించగా.. ప్యూర్ తెలుగు పదాలు, హృదయాన్ని తాకే భావాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇండియన్ కల్చర్, ఫారిన్ లైఫ్ స్టైల్ మధ్య ఉండే తేడాలను సింపుల్ గా వ్యక్తపరుస్తూ సంచారమే పాట సాగుతుంది. సినిమా స్టోరీకి అనుగుణంగా, యూత్ మనసుల్లోని ఫీలింగ్స్ వ్యక్తపరిచేలా సాంగ్ ను రూపొందించినట్లు చిత్రబృందం తెలిపింది.





సంచారమే పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ బాణీలు కట్టారు. ఆయన కంపోజిషన్ సాంగ్ కు మరింత అందాన్ని తీసుకొచ్చింది అంతేకాకుండా హేషమ్ అబ్దుల్ వహాబ్, గోరటి వెంకన్న కలిసి సాంగ్ ను ఆలపించడం విశేషం. వారి వాయిస్ పాటలోని భావాన్ని ప్రేక్షకుల హృదయాలకు **చేరవేస్తుందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు.**

అదే సమయంలో సాంగ్ విజువల్స్ పరంగా కూడా ఆకట్టుకుంటోంది. ఫారిన్ బ్యాక్ డ్రాప్ తో షూట్ చేసిన ఆ సాంగ్ లో లండన్ లోని ఫేమస్ స్పాట్స్ చూపించారు మేకర్స్. అక్కడి నేచర్ సీన్స్, సిటీ వాతావరణం మధ్య తెలుగు పాటను చిత్రీకరించిన విధానం ప్రేక్షకులను ఆకర్షిస్తోంది. ఓవరాల్ గా సాంగ్ మ్యూజిక్ లవర్స్ ను ఆకట్టుకుని.. అనేక మంది ఫేవరెట్ లిస్ట్ లోకి చేరిపోయిందని చెప్పాలి. ఇక సినిమాలో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మరోసారి కలిసి నటిస్తున్నారు. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన బేబీ సినిమా మంచి విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రంతో ప్రేక్షకుల మనసుల్లో నిలిచిన జంట మళ్లీ కలిసి నటించడంతో కొత్త సినిమాపై ఆసక్తి పెరిగింది. ఇప్పుడు సాంగ్ లో వీరి మధ్య కనిపించే ఎమోషనల్ మూమెంట్స్, కెమిస్ట్రీ, స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకుంటున్నాయి. ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్ మూవీతో ఆదిత్య హాసన్ డైరెక్టర్ గా పరిచయమవుతున్నారు. ఇప్పటికే ఆయన తీసిన 90స్ వెబ్ సిరీస్ ఓ రేంజ్ లో మెప్పించగా.. ఇప్పుడు సిల్వర్ స్క్రీన్ పై లక్ ను టెస్ట్ చేసుకోనున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగ వంశీ, సాయి సౌజన్య సినిమాను నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రఫీ అజీమ్ మహమ్మద్ నిర్వహించగా, ఎడిటింగ్ బాధ్యతలు నవీన్ నూలి చేపట్టారు. మరి స్మూత్ లవ్ స్టోరీతో రూపొందుతున్న ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్ ఎప్పుడు రిలీజ్ అవుతుందో, ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com